ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శుక్రవారం 13 మార్చి 2026 | Friday 13 march 2026 | హైదరాబాద్ Hyderabad | ➩ పేజీలు: 12+12 | ➩ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 27 సంచిక: 307 | Vol.No 27 Issue No .307 | www.visionandhra.in

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

- ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి, ● ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన



హైదరాబాద్,మార్చి12 : నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో మిగతా 2లో..



## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

- గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం
- దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు

యాదాద్రి,మార్చి12 : యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మిగతా 2లో..

## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

- అప్పడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు



టెహ్రాన్,మార్చి12 : ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత మిగతా 2లో..

### ఉస్మానియా విశ్వవిద్యాలయం
## తెలంగాణాకు ఐకాన్

- 1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్
- నిధులు మంజూరు చేయడం అభినందనీయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు




మిగతా 2లో..

## దేశంలో ఇంధన కొరత లేదు

- తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి
- రిఫనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి
- ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కొంటాం
- లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన
- మంత్రిని హేళన చేస్తూ ఎన్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావనతో గందరగోళం






న్యూఢిల్లీ,మార్చి12 : పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్‌పీజీ అంశంపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగింది. చర్చలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అయితే ఇంధన కొరతపై కేంద్రమంత్రి నిరసనల మధ్యే తన ప్రకటన చేశారు. భారత్‌లో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ మిగతా 2లో..

### త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమి సాధనలో
## పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,మార్చి12 : 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమి సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో మిగతా 2లో..

### తెలంగాణలో కమర్షియల్
## సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,మార్చి12 : తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మిగతా 2లో..

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక



ముంబై,మార్చి12 : పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. మిగతా 2లో..

## మన విదేశాంగ విధానం అమెరికాకు తాకట్టు

- ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి
- ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు



న్యూఢిల్లీ,మార్చి12: భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. మిగతా 2లో..

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి




మిగతా 2లో..

### కాశ్మీర్ మాజీ సిఎం
## ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

- తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి
- తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు




మిగతా 2లో..

### నీటి వినియోగంలో
## జాగ్రత్తలు ముఖ్యం

- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్
- జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు




అమరావతి,మార్చి12 : నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య- నైపుణ్యాభివృద్ధి తదితర మిగతా 2లో..

### బిఆర్ఎస్ ఫిరాయింపు
## ఎమ్మెల్యేల కేసు క్లోజ్

- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య



న్యూఢిల్లీ,మార్చి12 : తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం మిగతా 2లో..

## ఆనాడు ఒక్కడినే..ఈనాడు కోట్లాదిమందికి అండ

- నల్లకాలువ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు పార్టీ స్థాపన
- కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిండుగా ఉంది
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వైఎస్ జగన్



అమరావతి,మార్చి12 :పార్టీ స్థాపన సమయంలో తాను ఒక్కడినే ఉన్నానని, కానీ ఇప్పుడు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదంతో వైసీపీ ఒక పెద్ద శక్తిగా ఎదిగిందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ చెప్పారు. నల్లకాల్వలో ఇచ్చిన మాటే పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమైంది. ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2011 మార్చి 12న స్థాపించబడిన వైసీపీ.. ఇప్పుడు 16వ మిగతా 2లో..

# సంపాదకీయం

## ధాన్యం ఎగుమతి,దిగుమతులను సమీక్షించాలి !

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధానా÷-యల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది.ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు.పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు డమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం ముందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం,ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి.

# ప్రధాన మంత్రి భారతీయ జనఔషధీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్, మార్చి 12, (విజన్ ఆంధ్ర): ప్రధాన మంత్రి భారతీయ జనఔషధీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఆదివారం గోపు రమణారెడ్డి ఆధ్వర్యం లో ఆర్కే పురం, గీతాగానం భవన్, హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రధాన మంత్రి భారతీయ జనఔషధీ దివస్ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈఈ సందర్భంగా ముఖ్య అతిథి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, 2014లో దేశంలో దాదాపు 200 జనఔషధీ కేంద్రాలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 18,000కు పైగా కేంద్రాలు పనిచేస్తు న్నాయని తెలిపారు. భవిష్యత్తులో వాటిని 25,000కు పెంచే లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి లో కూడా జనఔషధీ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గోపు రమణారెడ్డి ఏర్పాటు చేసిన జనఔషధీ కేంద్రాల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులోకి వచ్చి వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు.కోట్ల రూపాయల వరకు ప్రజలు ఆదా చేసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా జనఔషధీ మెడిసిన్స్ కేంద్రాలు ఏర్పాటు చేసి, మందులు విక్రయాలు చేసి నంబర్ వన్ స్థానంలో నిలిచిన గోపు రమణారెడ్డి గారు (కోడ్ 3022) ను ముఖ్య అతిథి ఈటల రాజేందర్ ప్రత్యేకంగా సన్మానించి మోమెంటు అందజేశారు. అలాగే జనఔషధీ మందుల ప్రోత్సాహంలో మంచి సేవలందించిన మరికొందరిని కూడా ఈ సందర్భంగా సన్మానించారు. ఇందులోస్వప్న నందిని మియాపూర్ బ్రాంచ్, అమృత



శెట్టి జగిత్యాల, కృష్ణ పటాన్ చెరువు జనరల్ హాస్పిటల్ జనఔషధీ కేంద్రంవారిని కూడా ముఖ్య అతిథి ఈటల రాజేందర్ చేతుల మీదుగా సత్కరించి,మోమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా గోపు రమణారెడ్డి మాట్లాడుతూ, ఈ సన్మానాన్ని తాను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నా నని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో జనఔషధీ కేంద్రాలు ఏర్పాటు చేసి లక్షలాది మంది పేదలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందించేందుకు మరింతగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి మేజర్ జనరల్ జి.ఓ.సి టాస ఎన్. శ్రీనివాస్ రావు, బీజేపీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, నేరేడ్మెట్ మాజీ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి, వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ,మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, తెలంగాణ నోడల్ ఆఫీసర్ సౌరబ్ జాషువా,సమస్త జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు, జనఔషధీ కేంద్రాల యజమానులు, సిబ్బంది, కాలనీవాసులు వందలాది మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అందరికీ భోజన విందు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయ వంతంగా ముగించారు.

# వైభవంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

## పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు

### శివసేనారెడ్డి, చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పెబ్బేరు పట్టణ సమీపంలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయ పక్కన నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక శోభతో పునీతమైన పెబ్బేరు మున్సిపాలిటీలోమూడు రోజుల పాటు సాగిన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గణపతి హోమం, నవగ్రహ పూజలు, పూర్ణాహుతి వంటి క్రతువులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి మాట్లాడుతూ..గంగమ్మ తల్లి ఆశీస్సులు పెబ్బేరు ప్రజలందరిపై ఉండాలని, పాడిపంటలతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు పర్వీన్ షకీల్ భాగ్యలక్ష్మి శివ, జంబులమ్మ, శివ సాయి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేసాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, బోయ సత్యనారాయణ, దయాకర్ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి రణధీర్ రెడ్డి బ్రముని రాములుయాదవ్ డైరెక్టర్ రాములు వినయ్ కుమార్ ముదిరాజు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హన్మకొండ జిల్లా ప్రతినిధి మార్చి 12 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లాలో పశువులను గాలికుంటు (ఫీఓటు అండ్ మౌత్ ) వైరస్ వ్యాధి నుంచి రక్షించేందుకు ప్రతి రైతు తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.గురువారం హనుమకొండ జిల్లా వడ్డేపల్లి ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ వైరస్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు 2019 నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశు వులకు టీకాలు వేయడం జరుగుతోందన్నారు. అన్ని పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.

రైతులు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాలు అధికంగా రావాలనే ఉద్దేశంతో తెలియని ఇంజెక్షన్లు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేసేలా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు గోడపత్రికలు మరియు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతి గ్రామంలో గోడలకు గోడపత్రికలను అంటించి, కరపత్రాలను రైతులకు పంపిణీ చేసి టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం రావడం, నోటిలో మరియు కాళ్ల మధ్య పుండ్లు ఏర్పడటం వల్ల పశువులు మేత మేయలేక బలహీనపడతాయని తెలిపారు. దీని వల్ల పాల దిగుబడి తగ్గి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని చెప్పారు.మార్చి 10 నుండి ఏప్రిల్ 9 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశు వులకు ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకా వేయించుకోవాలని రైతులకు సూచించారు.ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ సత్య రెడ్డి మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి, పశు పోషణ, దూడల సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు, వడ్డేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఇతర పశువైద్య సిబ్బంది, రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంకుచిత మనస్తత్వం విడిచిపెడితేనే విశ్వ కుటుంబ భావన సాధ్యమవుతుంది

**స్వార్థ చింతన వల్లనే విశాల ప్రపంచం కుగ్రామమయిందశీటే పెద్దరికాన్ని చాటుకోవడానికి సాధన చేయాల్సిందే కదా!**
**--మాజీ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా రమేష్ చంద్ర లహోటి**
**రచనవడ్డేపల్లి మల్లేశం**

హుస్నాబాద్ వైయక్తిక జీవితాల సమాహారమే సామాజిక జీవితం అయితే ఆరోహణ అవరోహణలు, భిన్న దృక్పదాలు, సంఘర్షణలు, వైరుధ్యాలు సామాజిక జీవితంలో సహజం. వీటన్నింటినీ అధిగమించడం ద్వారా మెజారిటీ ప్రజానీకం ఆశించే ఆలోచనలు ఆకాంక్షలకు అనుగుణంగా పాలకులు పనిచేయడం ద్వారా ప్రజలను ఒప్పించాలి కష్టాల నుండి తప్పించాలి. ఇదే క్రమంలో పాలకులతో పాటు ప్రజల యొక్క సామాజిక బాధ్యత కూడా ఎక్కువే .మానవుడు సంఘజీవి అని అరిస్టాటిల్ చేసిన సూచన సామాజిక జీవితాన్ని అర్థవంతంగా ఫలవంతంగా తీర్చిదిద్దుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నది.అదే సందర్భంలో సంకుచిత మనస్తత్వం, స్వార్థపూరిత ఆలోచనలు, ప్రపంచం గురించి తోటి వాళ్ల గురించి కూడా విశాల హృదయంతో ఆలోచించకపోవడం వంటి దుర్గుణాలు మాత్రమే కాకుండా తనను తాను మాత్రమే గౌరవించుకొని అహంభావాన్ని ప్రదర్శించే కుళ్ళు లక్షణాల కారణంగా సమాజంలో మెజారిటీగా సంకుచిత మనస్తత్వం విస్తరించి అనేక వైరుధ్యాలకు కారణమవుతున్నది .ఈ క్రమంలోనే దుష్పరిణామాలు, దురాలోచనలు, అనాలోచిత చర్యలు సమాజంలో విస్తరిల్లిన కారణంగా శాంతియుత సమాజం కేవలం కలగానే మిగిలిపోతున్నది. వ్యక్తితో ప్రారంభమైనటువంటి ఒక ఆలోచన దాని పరిధి ఎంత విస్తృతమైతే యావత్ సమాజానికి అనువర్తింపజేసినట్లయితే అంత విశాల హృదయంతో ప్రపంచం వర్ధిల్లుతుంది. ఆ సానుకూల దృక్పథం, సదాశయం, మానవీయ విలువలు, ఆలోచన సరళి, అంకితభావం, శ్రామిక మనస్తత్వం, సేవా దృక్పథం, సమాజంలో కలిసి ఇతరులతో పంచుకోవడం, స్వార్థపూరిత ఆలోచనలు కలిగి ఉండకపోవడం వంటి లక్షణాలు ఎంత పరిధిలో ఆవరిస్తే అంతస్థాయిలో విశ్వ కుటుంబ భావన పరివ్యాప్తమవుతుంది.

ఈనాడు యుద్ధాలు సంఘర్షణలు అమానవీయ సంఘటనలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో చోటు చేసుకుంటున్న స్వార్థపూరిత తరుణంలో విశాల ఆలోచనలకు పదును పెట్టడం మాత్రమే పరిష్కారం అవుతుంది. ఈ విషయంలో భారతదేశపు మాజీ చీఫ్ జస్టిస్ రమేష్ చంద్ర లహోటి తన భావాన్ని వ్యక్తం చేసిన తీరు నేటి రేపటి సమాజానికి భవిష్యత్తు ప్రపంచానికి ఎంతో దోహదపడుతుందనడంలో సందేహం లేదు.“ ఆలోచన, సిద్ధాంతము, ఆచరణ రూపము దాల్చినప్పుడు మాత్రమే దాని ఫలాలు సమాజం అందుకుంటుంది. అందుకే ఇలాంటి సందేశాలు సంకేతాలు సూచనలు సామెతలు సూక్తులు భవిష్యత్తు తరాలు ఎప్పుడైనా స్వీకరించాలి.“ **మాజీ చీఫ్ జస్టిస్ మాటల్లో అర్థం, అంతరార్థం ......**“ నాది ఇది నీది అనుకునే వాళ్లది సంకుచిత మనస్తత్వం ఆ హద్దులను అధిగమించిన వారికే ప్రపంచమంతా ఒకే కుటుంబం అన్న భావన కలుగుతుంది. బలపడుతుంది కూడా “.న్యాయ శాస్త్రంలో చట్టాలు ప్రధాన పాత్ర పోషిస్తే న్యాయము మానవీయ విలువలు నైతికత తోటి మనిషిని సాటి మనిషిగా చూసే కనీస వ్యక్తిత్వం కూడా పరిగణించదగిన అంశాలే.“ న్యాయపరమైన విచారణ, సమీక్షలు న్యాయస్థానాలలో కొనసాగుతున్న సందర్భంలో చట్టానికి లోబడి మాత్రమే విచారణ ఆలోచన చేయకుండా అప్పుడప్పుడు న్యాయమూర్తుల స్థానంలో ఉన్నవాళ్లు సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి పరిణతి చెందిన తమ అనుభవాలను, జ్ఞానాన్ని, సామాజిక కోణాన్ని, మానవీయ విలువలను జోడించడం ద్వారా కొత్త విషయాలను సమాజానికి అందిస్తారు. అలాంటి సందర్భమే ఈ పైన తెలిపినటువంటి సానుకూల దృక్పథాన్ని పెంచి పోషించే సూక్తిగా మనం స్వీకరించాల్సి ఉంటుంది.“ రాజ్యాంగంలోని పీఠికలో న్యాయము అనే అంశం, చట్టం ముందు అందరూ సమానులే అనే భావన ప్రధాన పాత్ర పోషిస్తున్న నేపథ్యాన్ని అర్థం చేసుకున్నప్పుడు విశాల ఆలోచన పరిధి అనేది ప్రధానమని అర్థమవుతుంది. “స్వార్థపూరిత యాంత్రిక యుగంలో తోటి మనిషిని సాటి మనిషిగా గుర్తించే అవకాశం లేకుండా పోతున్న సమాజాన్ని యాంత్రికంగానే చూడడం జరుగుతున్నది. కళ్ళ ముందు జరుగుతున్న కటోర సత్యాన్ని కూడా పట్టించుకునే సందర్భాలు లేవు పైగా నేరం జరుగుతున్నప్పుడు చూస్తూ కూడా ప్రకటించడానికి సిద్ధంగా లేనటువంటి వాళ్ళు కూడా నేరస్తులే అని న్యాయ శాస్త్రం చెబుతుంటే నీది నాది అని స్వార్థపూరితంగా ఆలోచిస్తూ సంకుచిత మనస్తత్వంతో గిరిగీసుకుంటున్న తరుణంలో ప్రధానంగా పేద ప్రజలకు న్యాయం సాధ్యమేనా?“ ఆ హద్దులను కనుక చెరిపి వేయకుంటే, విశాల దృక్పథంతో ఆలోచించకుంటే చదివిన చదువు, అధ్యయనం, సామాజిక చింతన పనికిరానిదవుతుంది. స్వార్థపూరిత సంకుచిత మనస్తత్వాలను అధిగమించడానికి ఎవరైతే ప్రయత్నం చేస్తారో వారికి ప్రపంచమంతా ఒకే కుటుంబం అనే భావన అలబడుతుంది. ఈనాడు ప్రపంచమం ఎంతో విశాలమైనది అయినప్పటికీ అది కు గ్రామములాగా కుంచించుకు పోవడానికి ప్రధాన కారణం స్వార్థమే అని సంకుచిత మనస్తత్వం అని వీరి మాటల ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు. వివిధ రంగాలలో నిపుణులు, సామాజిక తత్వవేత్తలు, మేధావులు, శాస్త్రవేత్తలు, న్యాయ కోవిదులు, విద్యావేత్తలు ఎందరో తమ జీవితాలను దేశం కోసం ప్రపంచం కోసం ఫణంగా పెట్టి చరిత్రలో నిలిచిపోయిన మహానుభావులు ఎందరో. అలాంటి వారి యొక్క చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా ఆచరణను జీర్ణించుకోవడం ద్వారా విశ్వ మానవ కళ్యాణం మన దైనందిన కర్తవమని ప్రతి వ్యక్తి కూడా ఆలోచించగలిగే మార్పును తీసుకురావడానికి కృషి చేసినప్పుడు మాత్రమే ఈ సమాజంలో మనకు బ్రతికే అర్హత ఉంటుంది.లేకుంటే జంతువులు పక్షులకైనా ఉన్నటువంటి పరోపకార తత్వం కూడా లేకుండా యాంత్రికంగా బ్రతికితే ఫలమే ము న్నది? పాఠశాలలు కళాశాలలు విద్యాసంస్థల తో పాటు రాజకీయ శిక్షణ శిబిరాలలోనూ ఉద్యోగ సంఘాల సమావేశాలలోనూ ప్రతి చోటా స్వార్థాన్ని అణచివేయడానికి, విశాల హృదయాన్ని పెంపొందించడానికి, విశ్వ మానవ కుటుంబ భావనను అలవరసడానికి నిరంతరం సమాంతరంగా కృషి జరగాల్సినటువంటి అవసరం చాలా ఉన్నది. యాంత్రికంగా వాణిజ్య ధోరణిలో కొనసాగుతున్న విద్య వ్యాపారంగా మారిన తరుణంలో ఉన్నత తరగతుల వారికి కనీస మైనటువంటి విలువలకు సంబంధించినటువంటి పాఠ్య ప్రణాళికలు కూడా కను మ రుగవుతున్న వేళ జస్టిస్ రమేష్ చంద్రలహోటి గారి సూచన కారు చీకట్లో కాంతిరేఖ లాగా ఒక స్ఫూర్తిని, ప్రేరణను, దీక్షను ఇస్తుంది అనడంలో సందేహం లేదు. వ్యక్తులుగా ఆలోచిస్తూనే, సమూహాలుగా అవగాహన చేసుకుంటూనే జాతీయస్థాయిలో ఈ బావ న లను విస్తృతం చేసుకోవాలి. ప్రకటనలకు పరిమితమై ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగినామనో, మన పోటీ అంతా ప్రపంచం తోనే అనో గొప్పలు చెప్పుకోవడం కాకుండా ఆచరణలో ఆ విలువలను సాధించాలి. ఆత్మ శుద్ధి లేని ఆచారమదిఏల అన్నట్టు మనిషే ఎదగకుండా ఆర్థిక వ్యవస్థ పెరిగినట్లు చూపెట్టినా కూడా అర్థం లేదు కదా!

# జనగణన-2027 జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారుల శిక్షణా కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,మార్చి 12, (విజన్ ఆంధ్ర) 'హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో 'జనగణన-2027'లో భాగంగా 'హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్.ఎల్.బి క్రియేటర్ అప్లికేషన్ వినియోగం, పటాల తయారీ, సెల్ఫ్ ఎన్యూమరేషన్ వంటి కీలక అంశాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్ పరిధిని స్పష్టంగా గుర్తించి, సరిహద్దులను నిర్ణయించడంలో హెచ్.ఎల్.బి క్రియేటర్ వెబ్ మ్యాపింగ్ అప్లికేషన్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వార్డుల విభజన, స్లమ్ ఏరియాల గుర్తింపు, జియో-ట్యాగింగ్ ప్రక్రియను నిశితంగా చేపట్టాలన్నారు. రెవెన్యూ గ్రామాలు, పట్టణ వార్డులే ప్రాథమిక యూనిట్లుగా ఈ గణన జరుగుతుందని స్పష్టం చేశారు. డిజిటల్ జనగణనలో భాగంగా ప్రవేశపెట్టిన 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (స్వయం గణన) విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటి యజమానులు తమ సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునేందుకు వీలుగా 15 రోజుల పాటు పోర్టల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు నమోదు చేసిన సమాచారాన్ని ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధృవీకరిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మాట్, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు పంచాపూల, తహాశీల్దార్లు, ఎంపీడీవోలు,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి
## మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్



మల్కాజిగిరి, మార్చి 12, (విజన్ ఆంధ): మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోనివివిధ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ కోరారు. గురువారం ఆయన వివిధ కాలనీ వాసులతో వెళ్ళి, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్ జితేందర్ నాథ్ మాట్లాడుతూ..రైల్ నగర్,న్యూ బంజారా కాలనీ సీసీ రోడ్లు, ప్రెసిడెన్సీ కాలనీ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. అంతకు ముందు ఆయన రైల్ నగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి కాలనీలో సిసి రోడ్ల అభివృద్ధి పనుల ఆవశ్యకత ను పరిశీలించారు. నివాసితులతో మమేకమై పౌర మౌలిక సదుపాయాల అవసరాలపై చర్చించారు. పర్యటనలో రైల్ నగర్ ఆర్‌డబ్ల్యూఏ బృందం సభ్యులు, స్థానికులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం మచ్చ బొల్లారం డివిజన్ మాజీ కార్పొరేటర్, రాజ్ జితేందర్ నాథ్ మల్కాజిగిరిలోని జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి, పరీక్షల దృష్ట్యా 500 మందికి పైగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్‌లు, స్కేళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్‌బాగ్ మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మల్కాజిగిరి నాయకులు వెంకటేష్ యాదవ్, కపిల్, సతీష్, సృపత్ గౌడ్, శ్రీరామ్ యాదవ్, సంతోష్, రామ్ దాస్, గణేష్, రాజు, అమర్, అజయ్, కిషోర్, సురేష్ సింగ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్క మృతితో దుఃఖంలో పరీక్ష రాసిన చెల్లెలు

ఖమ్మం బ్యూరో మార్చి 12 ( విజన్ ఆంధ్ర)అక్క మరణంతో తీవ్ర దుఃఖంలో మునిగిపోయినా, తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైన ఓ విద్యార్థిని మనసును కదిలించే ఘటన మధిరలో చోటుచేసుకుంది.మధిర ప్రాంతానికి చెందిన చంద్ర హాసిని అనే విద్యార్థిని ఖమ్మం లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాస్తోంది. అయితే బుధవారం మధిర సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె అక్క శరణ్య దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయింది.అక్క ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయినప్పటికీ తన విద్యను ఆపకూడదనే సంకల్పంతో, కన్నీళ్లు ఆపుకుంటూ చంద్ర హాసిని పరీక్షా కేంద్రానికి వెళ్లి ఇంటర్ ఫస్ట్ ఇయర్ కెమిస్ట్రీ పరీక్షను రాసింది.తీవ్ర మనోవేదన మధ్య కూడా ధైర్యంగా పరీక్ష రాసిన హాసిని పరిస్థితి అక్కడున్న వారందరినీ కదిలించింది. ఆమె పట్టుదల, ధైర్యాన్ని పలువురు అభినందించారు.అక్కను కోల్పోయిన దుఃఖంలోనూ భవిష్యత్తు కోసం పరీక్ష రాసిన ఈ విద్యార్థిని ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## పెండింగ్లో ఉన్న భూసేకరణపనులను త్వరగా పూర్తి చేయాలి
### తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్
### కే. శివకుమార్ నాయుడు



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణ, ఇతర పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కే శివకుమార్ నాయుడు ఆదేశించారు. తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు గురువారం నాడు వనపర్తి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. ఎఈ పర్యటనలో భాగంగా ఆయన ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలు, పునరావాస పనుల పురోగతి అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు వెంటనే ఎంజాయ్మెంట్ సర్వే పూర్తిచేసి ప్రిలిమినరీ నోటిఫికేషన్ దారి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 26 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ ఈనెల 14వ తేదీలోపు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద డి 1, డి 5, డి 8, ప్యాకేజ్ 29 కు సంబంధించి 92 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ త్వరగా వారంలోపు కంప్లీట్ చేయాలి అన్నారు. ఘనపూర్ బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి మార్కింగ్ పూర్తయిన 31 ఎకరాల భూమికి సంబంధించి సర్వే శాఖ అధికారులు వెంటనే ఎంజాయ్మెంట్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు కొత్తకోట మండల పరిధిలోని కానాయిపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్ తో పాటు, శంకర సముద్రాన్ని సందర్శించిన కమిషనర్ అరెండర్ సెంటర్లో పెండింగ్ అంశాలను త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ నాగేందర్, ఎస్ ఈ చంద్రశేఖర్, ఈ ఈ కేశవరావు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్వే ఏడి శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లాభాల బాటలో వనపర్తి ఆర్టీసీ

**రెండేళ్లలో వనపర్తి డిపో**
**10 కోట్ల పైనే ఆదాయం**
**గత బిఆర్ఎస్ హయంలో**
**దివాలా తీసిన ఆర్టీసీ**
**కాంగ్రెస్ ప్రభుత్వంలో**
**లాభాల బాటలో ఆర్టీసీ సంస్థ**
**నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన**
**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి :గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఆర్టీసీ పూర్తిగా దివాలా దశలో ఉన్నప్పటికీనేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కోట్ల రూపాయల ఆదాయాన్ని గడిస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గురువారం వనపర్తి డిపోకు వచ్చిన నాలుగు నూతన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేవలం వనపర్తి ఆర్టీసీ డిపోకు 15 పల్లె వెలుగు బస్సులు 11 ఎక్స్ బస్సులు,2 డీలక్స్ బస్సులు, 4 ఎలక్ట్రికల్ బస్సులు మొత్తం 32 కొత్త బస్సులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారుగత బిఆర్ఎస్ హయంలో వనపర్తి డిపోకు సంబంధించి రోజుకు రూ. 4లక్షలు ఉండే ఆర్టీసీ ఆదాయం నేడు 30 నుంచి 35 లక్షలకు పెరిగిందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే కేవలం వనపర్తి డిపోకే దాదాపు 10 కోట్ల పైన ఆదాయం లభించిందని ఎమ్మెల్యే తెలిపారు.వనపర్తి డిపోలో ప్రస్తుతం 118 బస్సులు ఉన్నాయని మరో 30 నుంచి 40 కొత్త బస్సులను డిపోకు తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు.మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి వారికి నెలకు 70000 ఆదాయం వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే తెలిపారు.నిజాం కాలంలో ఏర్పాటుచేసిన ఆర్టీసీ డిపో కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు.వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి పల్లె మార్గానికి ఆర్టీసీ సర్వీసుల సేవలు అందేలా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్లి వచ్చేలా చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు బండారు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, ఆర్టీసీ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్‌గా సంగరాజు అశ్విని



తిరుపతిప్రముఖ అంతర్జాతీయ సంస్థ 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' దక్షిణ భారత దేశ చీఫ్ కో-ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన మేక్ మై బేబి జీనియస్ స్కూల్ డైరెక్టర్ సంగరాజు అశ్విని నియమితులయ్యారు. అశ్విని విద్యార్హతలు, ఆమెకు ఉన్న అనుభవం, నైపుణ్యాలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు సంస్థ పేర్కొంది. తమ సంస్థ అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషిస్తారని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. ఆమె ఇకపై ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ మిస్టర్ బింగి నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇటువంటి సంస్థలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల అశ్విని సంతోషం వ్యక్తం చేశారు. అశ్విని నియామకం పట్ల ఆమె తండ్రి ప్రముఖ హ్యాండ్ రైటింగ్ నిపుణులు, ఎంఎంబీజి స్కూల్ వ్యవస్థాపకులు భాస్కర్ రాజు హర్షం వ్యక్తం చేసారు.

## కలుపు మందు పారా క్వాట్ ను నిషేదించాలి



ఖమ్మం,మార్చ్ 12 (విజన్ ఆంధ్ర)రైతులు వాడే కలుపు మందు పారాక్వాటును నిషేధించాలని శ్రీ రక్ష హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవించారుపంట చేలలో రైతులు కలుపు నివారించడానికి విధివిగా ఉపయోగించే పారాక్వాట్ కలుపు మందు ఎంతో హానికరమైనదని కావున ఈ మందును వెంటనే అందుబాటులో లేకుండా చేయాలని ఖమ్మం నగరంలోని లక్కారం ట్యాంక్ బండ్ నందు శ్రీ రక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లు మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి సూచించారు ఈ కలుపు మందు వలన రైతులకు మరియు వంట చేనులకు చానా హాని చేస్తుందని డాక్టర్లు వివరించారు ఈ మందుకు విరుగుడు లేదని ఆవేశంలో ఈ మందు సేవిస్తే మరణం తప్ప దీనికి ఎలాంటి ట్రీట్మెంట్ లేకపోవడం వలన ఎంతోమంది దీని బారిన పడి మరణిస్తున్నారని కావున దీన్ని వెంటనే నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లకారం ట్యాంక్ బండి పై జరిగిన అవగాహన సదస్సులో ఖమ్మం జిల్లా ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ఇది ప్రజలకు ఎంతో అనారోగ్యానికి గురి చేస్తుందని దీనిపై ప్రభుత్వం సదస్సు లు నిర్వహించాలని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు ప్రముఖ వైద్యు లు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు బొల్లి కొడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మందు తాగిన వారిని చూసి ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నామని చాలా బాధపడుతున్నామని ఈ ముందుకు విరుగుడు లేకపోవడం వల్ల దీన్ని ప్రభుత్వాలే నిషేదించాలని దీనికి రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు తో పాటు డాక్టర్ల్ శ్రీనివాసరావు డాక్టర్ సతీష్ మరియు సామాజికవేత్తలు విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## రక్త పోటుతో కిడ్నీలకు ముప్పు ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కేర్ ఆసుపత్రుల వైద్యులు డా. రతన్ ఝా డా. విక్రాంత్ రెడ్డి హెచ్చరిక



బంజారా హిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో క్లినికల్ డైరెక్టర్ సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజీ డాక్టర్ పి. విక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధి ప్రారంభ దశల్లో స్పష్టమైన లక్షణాలు కనిపించక పోవడం వల్ల చాలా మంది దానిని పట్టించుకోరు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు ఉన్న వారిలో కిడ్నీలు సంవత్సరాల పాటు నెమ్మదిగా దెబ్బతింటాయి, అందువల్ల అలాంటి వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవడం చాలా అవసరం ముందుగానే గుర్తిస్తే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు అని. దేశంలో కిడ్నీ వ్యాధులు నిశ్శబ్దంగా పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది అని తెలిపారు



సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ రతన్ ఝా మాట్లాడుతూ:కిడ్నీ వ్యాధిని చాలా వరకు నివారించవచ్చు, ముఖ్యంగా ప్రమాద కారకాలను ముందుగానే నియంత్రించడం చాలా ముఖ్య ఆరోగ్య కరమైన జీవన శైలి పాటించడం, రక్తంలో చక్కెర మరియు రక్త పోటును నియంత్రణలో ఉంచడం. తక్కువ ఉప్పుతో సమతుల ఆహారం తీసుకోవడం క్రమం తప్పకుండా వ్యాయామం, అవసరం లేని నొప్పి మందులు వాడక పోవడం ద్వారా కిడ్నీలను రక్షించుకోవచ్చు అని తెలిపారు,

విజన్ ఆంధ్ర(12)హైదరాబాద్ : కిడ్నీ వ్యాధి ప్రారంభ దశల్లో లక్షణాలు కనిపించక పోవడం వల్ల చాలామంది సమస్యను ఆలస్యంగా గుర్తిస్తున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు, ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కేర్ హాస్పిటల్స్ వైద్యులు ముందస్తు పరీక్షల అవగాహన జీవన శైలిలో మార్పులు అత్యంత అవసరమని, మన శరీరంలో కిడ్నీలు రక్తంలోని వ్యర్థాలను వడకట్టడం, శరీరంలో ద్రవాల సమ తుల్యతను నిలుపు కోవడం రక్త పోటును నియంత్రించడం వంటి ముఖ్యమైన పనులు చేస్తాయి, అయితే కిడ్నీ వ్యాధిని సాధారణంగా సైలెంట్ డిసీజ్ గా పిలుస్తారు. ఎందుకంటే వ్యాధి ప్రారంభ దశల్లో స్పష్టమైన లక్షణాలు కనిపించక పోవడం వల్ల చాలా మందికి సమస్య ఉన్నట్టు తెలియదు, వైద్యుల వివరాల ప్రకారం భారతదేశంలో సుమారు 10నుండి 15శాతం మంది ఏదో ఒక రూపంలో దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నట్టు అంచనా కానీ, అవగాహన లేకపోవడం ప్రారంభ దశల్లో లక్షణాలు కనిపించక పోవడం వల్ల చాలా కేసులు గుర్తించ బడటం లేదు, ముఖ్యంగా దేశంలో మధుమేహం మరియు అధిక రక్తపోటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కిడ్నీ వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతోంది, ఈరెండు సమస్యలే కిడ్నీ వైఫల్యానికి ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతున్నారు, వైద్యుల ప్రకారం మధుమేహం అధిక రక్తపోటు వంటి వ్యాధులు కాల క్రమంలో కిడ్నీలను నెమ్మదిగా దెబ్బ తీస్తాయి, మధుమేహంతో బాధ పడుతున్న వారిలో రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల. కిడ్నీల్లోని చిన్న రక్తనాళాలు దెబ్బతింటాయి, ఫలితంగా రక్తంలోని వ్యర్థాలను వడకట్టే కిడ్నీల సామర్థ్యం క్రమంగా తగ్గుతుంది, అదే విధంగా నియంత్రణలో లేని అధిక రక్తపోటు కిడ్నీల్లోని రక్తనాళాలపై ఒత్తిడి పెంచి వాటిని బలహీన పరుస్తుంది, దీని వల్ల కిడ్నీ పనితీరు దెబ్బ తింటుంది, వైద్యులు చెబుతున్న కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే క్రమంగా కిడ్నీ పనితీరు పూర్తిగా దెబ్బతిని, కిడ్నీ వైఫల్యం దశకు చేరే ప్రమాదం ఉంటుంది, ఆ సమయంలో రోగులు డయాలిసిస్ లేదా కిడ్నీ మార్పిడి చేయించు కోవాల్సిన పరిస్థితి వస్తుంది, చికిత్స లేకుండా వదిలేస్తే శరీరంలో ద్రవాలు నిల్వ కావడం, రక్తహీనత, ఎముకల సమస్యలు గుండె సంబంధిత వ్యాధులు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది, కిడ్నీ సమస్యల గురించి ముందుగా తెలుసుకోవడం చాలా ముఖ్యం, కొన్ని లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. కాళ్లు మడమలు లేదా కళ్ల చుట్టూ వాపు తరచుగా లేదా చాలా తక్కువగా మూత్రం రావడం నురుగు లాంటి లేదా రక్తపు మచ్చలతో మూత్రం తరచూ అలసట వికారం, ఆకలి తగ్గడం, కండరాలు ముల్లు పెట్టడంనిద్రలేమి నియంత్రణలో లేని అధిక రక్తపోటు ప్రత్యేకంగా మధు మేహం, రక్తపోటు, ఊబకాయం ఉన్నవారు కుటుంబంలో కిడ్నీ వ్యాధి చరిత్ర ఉన్నవారు, 40 సంవత్సరాల పై బడినవారు, తరచుగా నొప్పి మందులు లేదా కొన్ని ఔషధాలు తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు, రక్త పరీక్షలు మూత్ర పరీక్షలు వంటి సాధారణ పరీక్షలతోనే ప్రారంభ దశలో కిడ్నీ వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు, ఇటీవలి కాలంలో వైద్య సాంకేతికతలో వచ్చిన పురోగతితో కిడ్నీ వ్యాధుల చికిత్సలో కూడా మంచి అభివృద్ధి జరిగింది, ఆధునిక నిర్ధారణ పరీక్షలు అధిక సామర్థ్యంతో పనిచేసే డయాలిసిస్ పద్ధతులు సమగ్ర కిడ్నీ మార్పిడి కార్యక్రమాలు విభిన్న విభాగాల వైద్యుల సమన్వయంతో చికిత్స అందించడం ద్వారా రోగులు మెరుగైన ఆరోగ్య ఫలితాలను పొందుతున్నారు, ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కేర్ ఆసుపత్రులు ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఆరోగ్య అవగాహన సమావేశాలు, ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించనున్నాయి, కిడ్నీ వ్యాధులను నివారించడంలో అవగాహన క్రమం తప్పని పరీక్షలు ఆరోగ్యకర జీవన శైలి కీలకమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

## అభివృద్ధిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పాత్ర కీలకం

**జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుదాం**
**కార్పొరేటర్లు, కౌన్సిలర్ల శిక్షణలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్(విజన్ ఆంధ్ర) మార్చ్, 12.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక" 90 రోజుల కార్యాచరణలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖలు ప్రజల కోసం అందించే సేవా కార్యక్రమాలు,పథకాల గురించి పి.పి.టి ద్వారా వివరించారు. మున్సిపల్ చట్టాలు, మున్సిపాలిటీలోని వివిధ విభాగాలు నిర్వహించే కార్యక్రమాలు,అధికారులు, సిబ్బంది విధులు,బాధ్యతలు గురించి వివరించారు,ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ కార్పొరేటర్లు, వార్డు సభ్యులు ఎంత బాధ్యతగా ఉంటే ఆ పట్టణాలు అంతలా అభివృద్ధి చెందుతాయని అన్నారు,వివిధ విభాగాల ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు,సమస్యల పరిష్కారానికి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు,నిత్యం శానిటేషన్ విధానం పర్యవేక్షించాలని,మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,వార్డులను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు,ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల ఎదురుగానే పరిష్కారం కావాలని ఉద్దేశంతో మున్సిపాలిటీల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు,99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, దరఖాస్తుల పరిష్కారం చురుగ్గా సాగుతోందని తెలిపారు,ప్రజాపాలన కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాలుపంచుకుంటూ అంతిమంగా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, హుజురాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, వైస్ చైర్పర్సన్ గూడూరి అంజలి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ మహమ్మద్, చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస, మున్సిపల్ కమిషనర్లు సయ్యద్ ముసాబ్ అహ్మద్, మనోహర్, మహమ్మద్ ఆయాజ్ పాల్గొన్నారు.

## ఏ ఎస్ పి చైతన్య రెడ్డి అరైవ్ అలైవ్ కార్యక్రమం పై ప్రజా ప్రతినిధులకు అవగాహన

కామారెడ్డి బ్యూరో మార్చ్ 12 (విజన్ఆంధ్ర)గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా యువతలో రోడ్డు ప్రమాదాల నివారణా, ప్రమాదాలు తగ్గించడానికి, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించడంలో గ్రామ సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని, ప్రతి యువత రోడ్డు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం, వేగాన్ని నియంత్రించడం, మొబైల్ ఫోన్ వాడకపోవడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్‌లు స్థానికంగా యువత కోసం అవగాహన శిబిరాలు నిర్వహించడానికి, స్కూల్‌లలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, యువకేంద్రాలలో రోడ్డు భద్రతా సెంటర్లలో ట్రైనింగ్‌ను పర్యవేక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని,ఈ కార్యక్రమం ద్వారా యువత రోడ్డు ప్రమాదాల నుండి స్వయంగా రక్షణ తీసుకోవడం, సురక్షితంగా ప్రయాణించడం కోసం అవగాహన పెంపొందించడం లక్ష్యం గా ముందుకు సాగాలని తెలిపారు

## సిద్దిపేట జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ విధింపు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి విజన్ ఆంధ్ర మార్చ్ 12సిద్దిపేట జిల్లాలో జరగనున్న పదవ తరగతి (ఎస్ ఎస్ సి) వార్షిక పరీక్షల నేపథ్యంలో, పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు మరియు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, గారు 163దీఎూా 2023 సెక్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఎూా 2023) సెక్షన్ 163 ప్రకారం, జిల్లాలోని ౨82 పరీక్షాలి కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు.ఈ ఆంక్షలు పరీక్షలు జరిగే రోజుల్లో, అంటే మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు, పరీక్ష జరిగే ప్రతిరోజూ ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు అమలులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు కలిగి ఉండటం నేరం. అలాగే, ఎగ్జామినేషన్ మెటీరియల్‌కు సంబంధించిన నిషేధిత కాగితాలను తీసుకెళ్లడం పూర్తిగా నిషేధం. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు.ఈ ఉత్తర్వుల నుండి కింది వారికి మినహాయింపు ఉంటుంది:౹ి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు౹ి విధుల్లో ఉన్న సైనిక సిబ్బంది౹ి విద్యాశాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అంత్యక్రియలఊరేగింపులువిద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేలా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన బందోబస్తు మరియు రక్షణ ఏర్పాట్లు చేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలుతీసుకోబడతాయని తెలియజేశారు.

## ప్రముఖ వ్యాపారవేత్త చాట్ల శ్రీశైలం కు నివాళులర్పించిన షబ్బీర్ అలీ



కామారెడ్డి బ్యూరో మార్చ్ 12 (విజన్ఆంధ్ర)కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు చాట్ల శ్రీశైలం ఇటీవల స్వర్గస్తులైన నేపథ్యంలో గురువారం నిర్వహించిన వారి పెద్దకర్మ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ హాజరై నివాళులర్పించారు.కామారెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న షబ్బీర్ అలీ చాట్ల శ్రీశైలం చిత్రపటానికి పూలమాల వేసి వారి స్మృతిని స్మరించుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, చాట్ల శ్రీశైలం కామారెడ్డి పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్తగా మాత్రమే కాకుండా, అనేక మందికి ఉపాధి కల్పించిన దాతృత్వ స్వభావం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తమ వ్యాపార సంస్థల ద్వారా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, సమాజానికి సేవలందించిన వ్యక్తి అని ఆయన కొనియాడారు.అదేవిధంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా శ్రీశైలం ఎల్లప్పుడూ ముందుండేవారని, అవసరమైన వారికి సహాయం చేయడంలో ఎప్పుడూ వెనుకాడని మంచి మనసున్న వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని షబ్బీర్ అలీ తెలిపారు.

శ్రీశైలం మృతి వారి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా, కామారెడ్డి జిల్లాలో ఆయన సంస్థలతో అనుబంధం ఉన్న వేలాది కుటుంబాలకు తీరని లోటని షబ్బీర్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, సామాజికవేత్తలు,పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని చాట్ల శ్రీశైలం కు నివాళులర్పించారు.

## సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు ప్రపంచ కిడ్నీ దినోత్సవం



కొత్తగూడెం బ్యూరో మార్చి 13(విజన్ ఆంధ్ర) కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు గురువారం నాడు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డావ ఆర్.కిరణ్ రాజకుమార్ ఆదేశాల మేరకు 12.03.2026 న ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా మూత్ర పిండాల వ్యాధులు మరియు నివారణ చర్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భముగా డివైసిఎంఓ కే.ఎస్.విశ్వమేధి మరియు హెల్త్ డాక్టర్ డి. లలిత లు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ప్రతి సంవత్సరం మార్చి నెలలోని రెండో గురువారం నాడు అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని, 2006లో ప్రారంభమైన ఈ ఉద్యమం, 2026 నాటికి రెండు దశాబ్దాలను పూర్తి చేసుకుంటోంది అని, “అందరికీ మూత్రపిండాల ఆరోగ్యం ▪ ప్రజల సంరక్షణ, భూమి రక్షణ“ అనే నినాధం తో ఈ ఏడాది అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం నిర్వహించుకుంటున్నాం అని తెలిపారు. కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన పెంచడం మరియు నివారణాలను అందరికీ తెలియజేయటం ఈ కిడ్నీ డే యొక్క ముఖ్య ఉద్దేశం అని, మధుమేహం, అధిక రక్త పోటు మరియు నొప్పి మాత్రలు ఎక్కువగా వేసుకోవటం ద్వారా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు వస్తాయని, కిడ్నీ వ్యాధిని “నిశ్శబ్ద వ్యాధి“ అని పిలుస్తారు, ఎందుకంటే 80% కిడ్నీలు దెబ్బతినే వరకు బయటకు ఎటువంటి లక్షణాలు కనిపించవని ఏ లక్షణాలు కనిపించవు అని, కొన్ని లక్షణాలు గుర్తిచటం ద్వారా కిడ్నీ వ్యాధులబారిన పడకుండా ఉంటారని తెలుపుతూ కిడ్నీ వ్యాధుల నివారణ కొరకు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, బిపి, షుగర్ ను నియంత్రణ లో ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకొని కిడ్నీలను కాపాడుకోవాలని వివరించారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు కిడ్నీ వ్యాదిన పడిన వారికి ప్రత్యేక డయాలసిస్ వార్డు ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో డివైసిఎంఓ కే.ఎస్.విశ్వమేధి, హెల్త్ డాక్టర్ డి. లలిత, మెయిన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు ..

## మార్చి 28న భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం బ్యూరో మార్చి 13(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఈ నెల లిలిమార్చి 28న (శనివారం)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఎం రాజేందర్ గురువారం ఒక ప్రకటన లొ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కక్షి దారులు తమ పెండింగ్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు చెక్ బౌన్స్ కేసులు బ్యాంకు రికవరీ కేసులు మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు వివాహ బంధానికి సంబంధించిన కేసులుఆస్తి పంపకాల వివాదాలు, అద్దె వివాదాలు మరియు ఇతర సివిల్ కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ఇ – చలాన్ కేసులు సైబర్ క్రైమ్ కేసులు చిన్న చిన్న దొంగతనం కేసులు టెలిఫోన్ కేసులు మనోవర్తి కేసులు కొట్టుకున్న కేసులు మొదలైన కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే పని లేకుండా తక్షణమే తుది తీర్పు లభిస్తుందని తెలిపారు. ఇక్కడ గెలుపోటములు ఉండవని, ఇరుపక్షాల అంగీకారంతోనే నిర్ణయం జరుగుతుందని అన్నారు. దీనిపై మళ్ళీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు.జిల్లాలోని కక్షిదారులు, ప్రతివాదులు తమ న్యాయవాదుల ద్వారా లేదా నేరుగా సంబంధిత కోర్టులలో సంప్రదించి తమ కేసులను లోక్ అదాలత్ జాబితాలో చేర్చుకోవాలని మరియు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోర్టుల చుట్టూ తిరిగే శ్రమను, ఖర్చును తగ్గించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

# ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలి

గ్రామ సభలు నిర్వహించి నిధులను ఖర్చు చేయాలి
ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి
దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చడానికి కృషి చేయాలి
గ్రామ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించాలి
99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.



ములుగు మార్చి 12;విజన్ ఆంధ్ర ప్రతినిధిగురువారం: ములుగు మండలం ఇంచర్ల గ్రామం లోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు మహిళా, శిశు సంక్షేమ, సెర్ప్, వైద్య ఆరోగ్య, విద్యా , సంక్షేమ శాఖలు, పర్యావరణ, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, సహకార, పౌర సరఫరాల, మున్సిపల్ (పురపాలక), పంచాయతీ రాజ్, పోలీస్ రవాణా, గృహ నిర్మాణ, విద్యుత్, యువజన , క్రీడా శాఖల పై శిక్షణ తరగతులు నిర్వహించగా మహిళా, శిశు సంక్షేమం, వైద్యం పై శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ప్రారంభించారు.జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు 12 శాఖలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మధ్యాహ్నం మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడానికి ప్రతి సర్పంచ్ కృషి చేయాలని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలే గ్రామాలను గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని సొంత ఇంటిలో భావించుకోవాలని, ప్రజా ప్రతినిధులు స్వార్థం కోసం పనిచేయకుండా ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ప్రజా ప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని, పూర్తిస్థాయిలో సేవలు అందించినప్పుడే ప్రజల గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 6 వందల కోట్ల రూపాయలు గ్రామ పంచాయతీలకు కేటాయించిందని, మరో 12 వందల కోట్ల రూపాయలు రావాల్సి ఉన్నాయని ఆ నిధులను తీసుకోరావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామాలలో ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఒక వెయ్యి మూడు కోట్ల రూపాయలను కేటాయించిందని, ఆనాడు చేసిన పనులకు కొంత మేరకు బిల్లులు చెల్లించగా ప్రస్తుతం 50 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఇటీవల సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 దృష్టిలో ఉంచుకొని సర్పంచులకు, పురపాలక కౌన్సిలర్లకు 12 శాఖలపై అవగాహన కల్పించడానికి ఈ శిక్షణను ఏర్పాటు చేశామని, శిక్షణలో అవగాహన చేసుకున్న ప్రజాప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తించడానికి తొమ్మిది రకాల అంశాలను పొందుపరచిందని, వాటిని అవగాహన చేసుకుని ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తింపు పొందడానికి కృషి చేయాలని అన్నారు. ఉత్తమ గ్రామపంచాయతీ కోటి రూపాయలు, మరో రెండు గ్రామపంచాయతీలకు అదనంగా నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందని వివరించారు. మారుమూల గ్రామాలు వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్. మహేందర్ జి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్ర కళ, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజా సేవ భగవంతుడిచ్చిన వరం!

నిధుల వినియోగంలో నూతన ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
–శిక్షణ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ఖమ్మం బ్యూరో మార్చి 12 (విజన్ ఆంధ్ర) “రాజకీయాల్లోకి మనం వచ్చింది కేవలం ప్రజా సేవ కోసమే. ఐదేళ్ల తర్వాత మనం పదవి నుంచి దిగిపోయేటప్పుడు.. మన గ్రామం, మన వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని ప్రజలు మనల్ని మనస్ఫూర్తిగా అభినందించాలి. ఆ ఆత్మీయతే మనం సంపాదించుకునే అసలైన ఆస్తి“ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గ్రామ పంచాయతీల బలోపేతం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. “గడిచిన కొద్ది రోజుల్లోనే పంచాయతీల ఖాతాల్లోకి గణనీయంగా నిధులు జమ అయ్యాయి. మార్చి ఆఖరు నాటికి మరిన్ని నిధులు రాబోతున్నాయి. ఈ నిధులను ఒక ప్రణాళికాబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగించాలి. మన సొంత డబ్బును ఎంత జాగ్రత్తగా వాడుకుంటామో.. ప్రజా ధనాన్ని కూడా అంతే బాధ్యతగా కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలి“ అని సర్పంచులకు సూచించారు.అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి కోరారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనలో చిన్నపాటి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.“ఎన్నికల వరకే రాజకీయాలు.. గెలిచిన తర్వాత మనమంతా ప్రజల సేవకులం. పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి“ అని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులకు అధికారులు పూర్తి స్థాయిలో మార్గనిర్దేశం చేస్తూ, వారిని ప్రోత్సహించాలని ఈ వేదిక ద్వారా కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాలు,పట్టణాల సమగ్ర అభివృద్ధి

### – ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీషబ్బీర్




కామారెడ్డి బ్యూరో మార్చ్ 12 (విజన్ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” కింద 99 రోజుల కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు.కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సులో షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ విభాగాల జిల్లా అధికారులు, నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ప్రభుత్వ 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను తీసుకువచ్చిందని చెప్పారు. ప్రభుత్వ పథకాలు నిజంగా ప్రజలకు చేరాలంటే గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ లక్ష్యాలు, కార్యాచరణ విధానం గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు.గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల కార్యచరణ ప్రణాళికను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి అభివృద్ధి ఫలాలను ప్రతి కుటుంబానికి చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ మైనర్ బాలికతో కిచెన్ లో పనులు చేయిస్తుండడం పట్ల ఆగ్రహం

కళాశాల ప్రిన్సిపాల్ కు షోకాజ్ నోటీసు జారీ
సదరు బాలికను పాఠశాలలో చేర్పించాలని అధికారులకు ఆదేశం



నిజామాబాద్, మార్చి 12 :(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్ లను సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థినుల కోసం వండిన అన్నం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కిచెన్ శుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కాగా, కిచెన్ లో మైనర్ బాలిక (16) పనులు చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, ఆమె గురించి వాకబు చేశారు. తన పెద్దమ్మతో కలిసి గత కొన్ని రోజులుగా కిచెన్ లో వంట పనులలో సహాయం చేస్తున్నానని సదరు బాలిక కలెక్టర్ కు తెలిపారు. దీంతో కలెక్టర్ కళాశాల నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుకునే వయస్సు కలిగిన మైనర్ బాలికతో ప్రభుత్వ విద్యా సంస్థలో ఎలా పనులు చేయిస్తున్నారని నిలదీశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యదా జైనబ్ కు షోకాజ్ మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చక్కగా చదువుకోవాలని, ప్రభుత్వ పరంగా అన్ని వసతులు కల్పిస్తామని బాలికకు కలెక్టర్ భరోసా కల్పించారు. బాలికను సమీపంలోని పాఠశాలలో చేర్పించి, ఉచిత విద్యా, వసతి అమలయ్యేలా చూడాలని సీ.డీ.పీ.ఓ, ఎం.ఈ.ఓలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డిగ్రీ విద్యార్థినులకు కొద్దిసేపు వివిధ అంశాలపై బోధన చేశారు. చక్కగా చదువుకుని ఉన్నత విద్యను పూర్తి చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఈ దశలో చదువును ఆపకూడదని మార్గనిర్దేశం చేశారు.

## మార్చి 15న హమాలీ మహాగర్జనను జయప్రదం చేయండి



హన్మకొండ జిల్లా ప్రతినిధి 12 (విషన్ ఆంధ్ర)హమాలి సోదరులారా కార్మిక సోదరులారా. తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ కొద్ది మంది అమాలి కార్మికులతో 2016 లో పురుడు పోసుకొని నేడు అతిపెద్ద యూనియన్ గా ఏర్పడింది మరియు 30 జిల్లాలలో మా సంఘం పనిచేస్తుంది వేలాదిమంది సభ్యులతో బలమైన నిర్మాణం కలిగి ఉన్నది కార్మికులు అనేక సమస్యలతో కొన్నిచోట్ల పిఎఫ్ ఈఎస్ఐ లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో 10 లక్షల మంది పైగా అమాలి కార్మికులు పనిచేస్తున్నారు లోడింగ్ అన్లోడింగ్ రంగాలలో నిత్యం శ్రమ చేస్తూ సరుకులు రవాణాలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో హమాలీలు కీలక పాత్ర పోషిస్తున్నారు మార్కెట్ యార్డులు గిడ్డంగులు గుడిసెట్ పార్టీలాజార్స్ గోదాములలో లిక్కర్ గోదాములలో సిమెంట్ షాపులలో బజారులలో రైస్ మిల్ పిల్లల్లో ధాన్యం సేకరణ కేంద్రాలలో ట్రాన్స్పోర్ట్ లాంటి పలు వ్యాపార సంస్థలలో ఈ కార్మికుల పనిచేస్తుంటారు కార్మిక కుటుంబాలలో ఆదాయాలు పెరగడం లేదు తీవ్రమైన శారీరక శ్రమ చేస్తూ తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు ఇలాంటి పరిస్థితులలో తెలంగాణ వస్తే మా బతుకులు మారుతాయి అని ఎన్నో కలలు కన్నా కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు 10 ఏళ్ల హమాలీలకు అసలు పట్టించుకోవడం లేదు హమాలీ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం లేదు ఇతర రాష్ట్రాల్లో పోలిస్తే మన రాష్ట్రంలో కార్మికులకు తక్కువ వేతనం ఇస్తున్నారు ఈ నేపథ్యంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని మండల కేంద్రాల్లో హమాలీల కోసం కాలనీలను ఏర్పాటు చేసి గృహ నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఆ వెలుగులో కాంగ్రెస్ పై నమ్మకంతో హవాలి హెల్పర్ బోర్డు కోసం మార్చి 15న హమాలీ మహా గర్జన విజయవంతం చేయాలని కార్మికులకు ప్రజలకు మేధావులకు పిలుపునిస్తున్నాం ఇట్టి కార్యక్రమానికి కాంగ్రెస్ మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి గారు మరియు శీతక్క గారు మరియు నాయిని రాజేందర్ రెడ్డి గారు కోదండరామ రెడ్డి గారు ప్రొఫెసర్ కాసిం గారు పాల్గొంటారు కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిస్తున్నాంఈ ప్రెస్ క్లబ్ లో పాల్గొన్న వారు గుంటి సామ్రాజ్యం గారు తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, కూర వెంకట్ ఐ ఎన్ టి సి జిల్లా అధ్యక్షుడు, రమేష్ రాజబోయిన యాకయ్య జిల్లా అధ్యక్షుడు ,గోనే సదానందం జిల్లా ప్రధాన కార్యదర్శి ,పిట్టా కరుణాకర్ సంపత్ తదితరులు పాల్గొనడం జరిగిందిలి.–9989853843

## 14 న జరిగే అంజన్న ఆశీర్వాద యాత్రకు తరలిరండి

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులకు జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ పిలుపు...

కరీంనగర్ (విజన్ ఆంధ్ర) మార్చ్,12.భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఈనెల 14న చేపట్టనున్న కొండగట్టు అంజన్న స్వామి ఆశీర్వాద పాదయాత్ర లో కార్మికులంతా పాల్గొనాలని ఉమ్మడి జిల్లా కార్మిక జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ కోరారు . ఈ మేరకు గురువారం రోజున చాడఆనంద్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ చైతన్యపురి సమీపంలోని మహాశక్తి ఆలయం వద్ద నుండి ఘనంగా ప్రారంభమై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు జరుగుతున్న ఈ పాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర ద్వారా కార్మికుల ఐక్యత మరింత బలపడటంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించి ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులు పాదయాత్రకు మద్దతు తెలుపుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.కరీంనగర్ పట్టణంలో ఉన్న కార్మికులు మరియు కార్మిక సంఘాల నాయకులు ఉదయం మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోవాలని, అలాగే మిగతా మండలాలు, గ్రామాలలో ఉన్న కార్మిక నాయకులు పాదయాత్రకు మార్గమధ్యంలో స్వాగతం పలుకుతూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ చైర్మన్ చాడా ఆనంద్ ఈ ప్రకటనలో కోరారు.

## జోయాలుక్కాస్ గోల్డ్ షోరూంను ప్రారంభించిన మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు




హన్మకొండ జిల్లా ప్రతినిధి మార్చ్ 12 ( విజన్ ఆంధ్ర)హన్మకొండ నక్కలగుట్ట లో నూతనంగా ప్రారంభమైన జోయాలుక్కాస్ గోల్డ్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు .తొలుత రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి షో రూమ్ ను ప్రారంభించారు…ఈ సందర్భంగా షోరూం యాజమాన్యం ఎమ్మెల్యే నాగరాజు ని శాలువాతో సత్కరించి సన్మానించారు.అనంతరం షోరూం లో నిర్వహించిన ఫ్యాషన్ షో ను తిలకించిన ఎమ్మెల్యే నాగరాజు నిర్వాహకులకు మరియు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.జోయాలుక్కాస్ గోల్డ్ షోరూం లో ఎస్ ఆర్యా, నివర్సిటీ అడ్మిషన్స్ టి శేషగిరిరావు టి. శేషగిరిరావు మొదటి కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వ్యాపార వేత్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు…

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

## ప్రభుత్వ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలి…

### శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి…

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.



ములుగు మార్చి 12;విజన్ ఆంధ్ర ప్రతినిధిగురువారం: ములుగు మండలం ఇంచర్ల గ్రామం లోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు మహిళా, శిశు సంక్షేమ, సెర్ప్, వైద్య ఆరోగ్య, విద్యా , సంక్షేమ శాఖలు, పర్యావరణ, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, సహకార, పౌర సరఫరాల, మున్సిపల్ (పురపాలక), పంచాయతీ రాజ్, పోలీస్ రవాణా, గృహ నిర్మాణ, విద్యుత్, యువజన, క్రీడా శాఖల పై శిక్షణ తరగతులు నిర్వహించగా మహిళా, శిశు సంక్షేమం, వైద్యం పై శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ప్రారంభించారు.జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు 12 శాఖలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మధ్యాహ్నం మంత్రి సీతక్క హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి విషయంలో సర్పంచ్ ల పాత్ర ఎంతో కీలకమైనదని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందచేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వైద్య సేవలు పొందడానికి జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యే వారని నేడు ములుగు జిల్లాకు మెడికల్ కళాశాల రావడమే కాకుండా నర్సింగ్ కళాశాల ఏర్పాటు జరిగిందని, 15 మంది ప్రత్యేక వైద్య నిపుణులచే వివిధ వ్యాధి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి ఇక్కడి కళాశాలలోనే వైద్య పట్టా పొందే అవకాశం దక్కిందని, ప్రతి ఒక్కరికి వైద్యం అనేది ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రస్తుతం 60 శాతం కేసులను పరీక్షించి ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారని, గత మూడు నెలల క్రితం ఏకంగా రెండు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు శాస్త్ర చికిత్సలు చేసి విజయవంతం చేశారని హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగులకు పెన్షన్ మంజూరు విషయంలో ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తీసుకవచ్చిందని ధ్రువీకరణ పత్రం స్థానంలో యు డి ఐ డి కార్డును ప్రవేశపెట్టడం జరిగిందని, దివ్యాంగులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే ముందు ఈ కార్డు తప్పనిసరిగా పొంది ఉండాలని అన్నారు.యు డి ఐ డి కార్డు కోసం దివ్యాంగులు మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి గురువారం సామాజిక ఏరియా ఆసుపత్రిలో జరిగే సదరం క్యాంప్ కు వైద్య పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. క్యాంపు ద్వారా వైద్య పరీక్షలు జరిగిన అనంతరం 30 రోజుల్లో యు డి ఐ డి కార్డు పోస్ట్ ద్వారా నేరుగా తమ చిరునామాకు చేరుతుందని అనంతరం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా ప్రతి పీహెచ్సీలో గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్. మహేందర్ జి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్ర కళ, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో సమస్యలు పరిష్కారం

### శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 12 ( విజన్ ఆంధ్ర ) : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలో నర్సింగ్ ఫంక్షన్ హాల్ నందు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్ లకు శిక్షణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించి ఎన్నికైన నూతన సర్పంచ్ లు పురపాలక సంఘం ఎన్నికలలో విజయం సాధించి ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లకు స్పీకర్ ముందుగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ…రాష్ట్ర ముఖ్యమంత్రి డైనమిక్ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో, దేశంలో పెద్ద స్థాయికి ఎదిగిన ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది సర్పంచ్ లుగా, కౌన్సిలర్లు గా రాజకీయ జీవితం ప్రారంభించిన వారేనని, నేను కూడా ఎంపీటీసీ గా రాజకీయ జీవితం ప్రారంభించి ఎంపీపీగా తదుపరి శాసనసభ్యునిగా, మంత్రిగా, ఇప్పుడు రాష్ట్రంలో శాసన వ్యవస్థలో అత్యంత ఉన్నతమైన అసెంబ్లీ స్పీకర్ గా ఉన్నానని తెపుతూ…కింది స్థాయి నుండి వచ్చిన ప్రజాప్రతినిధులకు సామాజిక అంశాలు, పేదలకు అందించాల్సిన సేవలపై ఎక్కువ అవగాహన ఉంటుందని ఆయన అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఉంటుందని, ఇక్కడ ఎన్నికైన సర్పంచ్ లు, చైర్మన్లు, కౌన్సిలర్లలో ఎక్కువ మంది కొత్తవారే కాబట్టి ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మీ విధులు, మీరు చేయవలసిన పనులపై మీకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని తద్వారా మీరు ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలను అందించగలుగుతారని ఆయన తెలిపారు.ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు రెండు కళ్ళ



లాంటి వారు, అదేవిధంగా బండికి రెండు చక్రాల లాంటి వారని కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పథకాలు సమర్థవంతంగా ప్రజలకు అందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని స్పీకర్ సూచించారు.ఇప్పుడు గెలిచిన సర్పంచ్ లు, చైర్మన్లు, వార్డుల సభ్యులు అదృష్టవంతులు, రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన నడుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజారంజక పరిపాలన జరుగుతున్నదని ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇప్పుడు పదవిలో ఉన్న మీ ద్వారా అమలవుతాయి కాబట్టి మీకు మంచి పేరు వస్తుందని ఆయన అన్నారుముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ , సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ళు, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్, డ్వాక్రా మహిళలకు ఉచిత రుణాలు వంటి సంక్షేమ పథకాల అమలు గురించి అందరికీ అవగాహన కలిగించి అర్హులైన వారందరికీ అందే విదంగా పనిచేయాలని ఆయన తెలిపారు. తులం బంగారం, మహిళలకు ఆర్థిక భరోసా, పెన్షన్ల డబ్బులు పెంచడం వంటి వాటి గురించి మిమ్మల్ని ప్రజలు అడిగినప్పుడు మీరు వారికి అర్థమయ్యే విదంగా గత ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు, ఆర్థిక విధ్వంసం, ఇప్పుడు నెలకు 6500 కోట్ల రూపాయలు మిత్తి కడుతున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని, ఆర్థిక పరిస్థితులు చక్కబడగానే త్వరలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

వేలు, లక్షల మందిలో ఒక్కరికి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం వస్తుంది, మీకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల మనసులో నాటుకుపోయే విదంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు, మిగిలిన సమయంలో అందరూ కలిసి సమిష్టిగా గ్రామాలను, వార్డులను అభివృద్ధి చేసుకోవాలని అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించాలని తెలిపారు.వికారాబాద్ జిల్లా నుండి ముఖ్యమంత్రి, స్పీకర్ వంటి ఉన్నత స్థానాలలో ఉన్నామని నిధులు మంజూరు చేయించే బాధ్యత మాదని సమర్థవంతంగా ఖర్చు చేసే బాధ్యత ప్రజా ప్రతినిధులదని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ…ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రనిధుల భాగస్వామ్యం, సహకారం అవసరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేవిధంగా కృషి చేస్తామన్నారు. గ్రామ సభల్లో ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరించబడతాయని కలెక్టర్ తెలిపారు. తాండూర్ శాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవచేయడం అదృష్టంగా భావించాలన్నారు. 99 రోజులుగా నిర్వహించే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు జవాబుదారీ తనంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్పీ సీఈవో సుధీర్, డి మంగిలాల్, ఆర్డీవో వాసు చంద్ర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లు గడ్డం అనన్య, పట్లోళ్ల నీరజ, రజితలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బోధనలో సాంకేతికతను వినియోగించుకోవాలి

### డీ ఈ వో,రాజు



కామారెడ్డి బ్యూరో మార్చి 12 (విజన్ ఆంధ్ర)మారుతున్న మార్పులకు అనుగుణంగా విద్యాబోధనలో సాంకేతికత ను వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు అన్నారు. సదాశివనగర్ మోడల్ స్కూల్ లో రెండు రోజులపాటు ఏ ఎక్స్ ఎల్ లాబ్ ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులకుజరిగిన శిక్షణ కార్యక్రమ ముగింపు సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లో 23 పాఠశాలలలో. ఏ ఎక్స్ ఎల్ లాబ్ లు ఉన్నాయని సమీప హై స్కూల్.ప్రధానోపాధ్యాయుల సహకారంతో ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకుని రెగ్యులర్ గా తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు. త్వరలో ప్రాథమిక.పాఠశాల లకు కూడా ఇంటర్ నెట్ వచ్చే విధంగా ప్రతిపాదన పంపుతామని ఆయన అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఎ యాక్స్ యల్ లాబ్ ద్వారా భాష, గణితం లలో ప్రావీణ్యం కల్పించ వచ్చునని ఉపాధ్యాయులు ఈ విషయంలో అంకిత భావంతో కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30,31 తేదీలలో ఎన్ సి ఈ ఆర్ టి ఆధ్వర్యంలో జరిగే ఎఫ్ ఎల్ ఎస్ కోసం విద్యార్థులను.పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ. మొబిలైసేషన్ అధికారి నాగవేందర్, స్థానిక మండల విద్యాశాఖాధికారి యోసెఫ్ , మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి రిసోర్స్ పర్సన్స్ అఖిల్, వెంకటేష్ సాయి, ప్రసాద్, జావేద్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోండి

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన సదస్సు



హనుమకొండ జిల్లా ప్రతినిధి మార్చ్ 12 (విజన్ ఆంధ్ర)జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించే కార్యక్రమం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి గారు , జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రభుత్వం రూపొందించిన ప్రజా పాలన ▪ ప్రగతి ప్రణాళిక ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయడం ఈ కార్యాచరణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీఏ అధికారి మేన శ్రీను, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కార్పొరేటర్ మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్,విజయశ్రీ రజాలి,మామిండ్ల రాజు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్దేశిత లక్ష్యంతో వర్ధన్నపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కృషి

**రూ.1 కోటి 35 లక్షల రూపాయల పనులకు ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన..**
**ప్రజల మధ్యలోనే పాలనడ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం: ఎమ్మెల్యే నాగరాజు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి 12 మార్చి (విజన్ ఆంధ్ర)వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిని నిర్దేశిత లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం మరియు స్థానిక అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. గురువారం 1వ డివిజన్ పరిధిలో రూ.1.35 కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు మరియు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు…ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల మధ్యలోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్లో ప్రారంభించిన పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చినట్లు తెలిపారు.నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఏబీసీ కేటగిరీలుగా గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు మంత్రులతో సమన్వయం చేస్తూ వర్ధన్నపేట నియోజకవర్గంలో కీలకమైన అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.డివిజన్లలో కార్పొరేటర్లు మరియు స్థానిక నాయకత్వం ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తూ తమ దృష్టికి తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు…ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరుణగంటి అరుణకుమారి, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్, కాంగ్రెస్ నాయకులు కొంక హరిబాబు, గడ్డం శివరాం ప్రసాద్, చిర్ర రాము, రవి యాదవ్, నన్నబోయిన రమేష్ యాదవ్, అరుణ్, కమలాకర్ తో పాటు డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## భూ సేకరణ పూర్తయితేనే ప్రాజెక్టుల పనులు వేగవంతం

### ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు



గద్వాల మార్చి 12 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల పనులు వేగవంతం కావాలంటే భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని ఆర్ అండ్ ఆర్ (రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్) కమిషనర్ శివకుమార్ నాయుడు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి సంబంధిత అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో ఇంకా 541 ఎకరాల భూ సేకరణ నోటిఫికేషన్, సర్వేస్థాయిలో ఉందని, ప్రక్రియ పూర్తి చేస్తే ప్రభుత్వం నిర్వాసితులకు సత్వరమే డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు కు రిజర్వాయర్ నిర్మాణానికి ఇంకా 212 ఎకరాలు, గట్టు కుడి, ఎడమ కాలువలకు 249 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఆర్డీఎస్ పరిధిలో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి 567 ఎకరాల భూమి సేకరించాల్సి ఉన్నందున రైతులకు గ్రామ సభలు నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు. ఆయా ప్రాజెక్టుల భూసేకరణ పూర్తయితేనే నిర్మాణాల పనులు వేగవంతమై, సంబంధిత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, పిజెపి సిఈ నాగేంద్రం, ఎస్ఈ రహీముద్దీన్, ఈ ఈ శ్రీనివాస్, సర్వే ఏడి నూకరాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## యువత మాదక ద్రవ్యాల పై అవగాహన కలిగి ఉండాలి

**ఈగల్ ఫోర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హేమారాణి**
**జూలూరుపాడు అంబేద్కర్ సెంటర్లో పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ ర్యాలీ**
**మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులకు అవగాహన.**

జూలూరుపాడు మార్చి 13 (విజన్ ఆంధ్ర) జూలూరుపాడు మండలం యువత భవిష్యత్తుపై ప్రభావం చూపి వారి ఆరోగ్య లతో ఆడుకుని మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ హేమారాణి విద్యార్థుల కు పిలుపునిచ్చారు. గురువారం భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పోలీస్, ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్య పట్ల చెడు అలవాట్లు పట్ల జాగ్రత్త వహించాలి మాదకద్రవ్యాల కు అలవాటు పడే ఏకైక అవకాశం చెడు స్నేహం ఎవరికి వారు భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణ పట్ల చిత్తశుద్ధితో చదువుల పట్ల ముందుకు సాగాలి. ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాల కి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు అంటూ ముందుకు సాగాలి. చెడు స్నేహితుల వల్ల మంచి విద్యార్థులు బలి అవుతున్నారు. మాదకద్రవ్యాలు సేవించడం వల్ల ప్రాణాంతకం అయిన నోటి గొంతు పేగు క్యాన్సర్ తో కాలేయం ఊపిరితిత్తులు గుండె మెదడు ఇలా అన్ని ఆర్గాన్స్ దెబ్బతిని వాటి పనితీరు మందగించడమే కాక వారి ప్రవర్తనలో ప్రత్యేకమైన తేడాలు కనిపిస్తుంటాయి చెడుకు దగ్గర అవడం వల్ల, మంచికి దూరంగా అవుతున్నామన్న సంగతి గుర్తుంచుకోవాలి. చెడు వ్యసనాలు ఉండటం వల్ల ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు ను కోల్పోతున్నాము. చదువుకోవాల్సిన వయసులో చెడు వ్యసనాల బారిన పడి వందల మంది విద్యార్థి నిండు జీవితాలు వదిలేసి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తన తీరు పట్ల జాగ్రత్త వహించి మంచి మార్గంలో నడిపించుటకు సమాయత్తం అవ్వాలి అని సూచించారు. మానవ జీవితం ఎంతో విలువైన జీవితంగా పరిగణించాలని డ్రగ్స్ బారినబడి పాడు చేసుకోవద్దని డ్రగ్స్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఆర్యవైశ్య కళ్యాణమండపం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్సై బాధావత్ రవి, విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ ,జూలూరుపాడు పి హెచ్ సి వైద్యులు వెంకటేశ్వర్లు ,ఎమ్మార్వో గొర్రె ముచ్చు ప్రసాదరావు, ఏ ఎస్ ఐ శ్రీనివాసరావు ,జూలూరుపాడు జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంబళ్ల లక్ష్మి నరసయ్య, ఎంపీపీ ఎస్ ప్రధానోపాధ్యాయులు ,నేతాజీ ఉపాధ్యాయులు గుగులోత్ సీతారాములు మహేష్ తదితరులు పాల్గొన్నారు .

# గంజాయి రహిత రామవరం లక్ష్యంగా పోలీసుల ఉద్యమం

## విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

### --నారాయణపేట షి టీమ్ పోలీసులు



నారాయణపేట మార్చి 12 (విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూ ఆర్ జె సి గర్ల్స్ జూనియర్ కాలేజీలో గురువారం విద్యార్థినులకు షి టీమ్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెల్ ఫోన్ అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మహిళల భద్రత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు చెన్నప్ప, బాలరాజు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. సెల్ ఫోన్‌ను అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించాలి గానీ అధికంగా వినియోగించడం వల్ల చదువుపై దుష్ప్రభావం పడటంతో పాటు మానసిక సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా షి టీమ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా వెంటనే షి టీమ్ పోలీసులకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వేధింపులు చట్టపరంగా శిక్షార్హమైన నేరాలు అని తెలిపారు. విద్యార్థినులు ఇలాంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకుండా వెంటనే షి టీమ్ పోలీసులకు 8712670398 కి లేదా డయల్ 100 కి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, తల్లి తండ్రులు, షి టీమ్ పోలీసులు కవిత జ్యోతి పాల్గొన్నారు.

## 14 నుండి పదో తరగతి పరీక్షలు

### పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి.

### ◌మండల విద్యాధికారి సలీం షరీఫ్.



కోదాడ, మార్చి 12 (విజన్ ఆంధ్ర):కోదాడ పట్టణంలో ఈనెల 14 నుండి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల ద్యాధికారి సలీం షరీఫ్ తెలిపారు. విద్యార్థులు ఎవరు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. కోదాడ పట్టణంలో 11 పరీక్ష కేంద్రాల్లో లోటుపాట్లు తలెత్తకుండా, కట్టదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లను అనుమతించడం లేదని, పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించామన్నారు. పట్టణంలో 1485 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 130 మంది సిబ్బంది తో, 11 సెంటర్లలో 22 మంది చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి సెంటర్ కి పోలీస్ బందోబస్తు ఉంటుందని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, అవసరమైన ఫర్నిచర్తో పాటు వైద్య సేవలను అందుబాటులో ఉంచుతున్నాం అన్నారు. విద్యార్థులు ఆందోళనకు గురి కావద్దు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురై ఆందోళన చెందవద్దని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణం కల్పించాలని ఒక గంట ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల ఎదుటే తెరిచేలా ఏర్పాటు చేశామని ప్రతి పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ముఖ్య గమనిక. కోదాడ హై స్కూల్ భవాని నగర్ అడ్రస్ కోదాడ హై స్కూల్ (కె టి ఎస్) అశోక్ నగర్, విజయవాడ రోడ్డులో ఉంటుందని, ఆక్స్ఫర్డ్ హై స్కూల్ హుజూర్ నగర్ రోడ్డు లోని భారతి విద్యా మందిర్ పక్కన కలదని, ఎస్ వి హై స్కూల్ భవాని నగర్ నందు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు సందులో ఎస్వీ కాలేజ్ దగ్గర కలదని పదవ తరగతి విద్యార్థులకు ముందస్తుగా తెలియజేయాలని తెలిపారు.

## ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి ఉపకార వేతనాలు, బోధన రుసుముల జమ

### జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత

గద్వాల మార్చి 12 (విజన్ ఆంధ్ర)జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు 2024 ' 25 విద్యా సంవత్సరానికి గాను చెల్లించవలసిన బోధన రుసుములు (ట్యూషన్ ఫీజులు), ఉపకార వేతనాలను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 60% వాటా కింద రూ. 81,40,554 లక్షలు మొత్తాన్ని 784 మంది విద్యార్థులకు, రాష్ట్ర ప్రభుత్వం 40% వాటా కింద రూ. 74,98,852 లక్షలు మొత్తాన్ని 910 మంది విద్యార్థులకు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మొత్తాలను సంబంధిత విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల ఇంకా 588 మంది విద్యార్థుల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలను పూర్తి చేసి ఈ నెల చివరి వరకు సంబంధిత జిల్లా కార్యాలయంలో సమర్పించిన వెంటనే నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చొరవ తీసుకుని విద్యార్థులు అవసరమైన పత్రాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత ప్రకటన ద్వారా తెలిపారు.

### డీజే, డప్పు చప్పుళ్లతో డ్రగ్స్‌పై యుద్ధం

### రామవరం లో పోలీసుల భారీ అవగాహన ర్యాలీ



కొత్తగూడెం బ్యూరో మార్చి 13(విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతంలోని చమన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రామవరం టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట, చైల్డ్ సేఫ్టీ, యాంటీ డ్రగ్ డ్రైవ్‌పై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని రామవరం సీఐ పిలుపునిచ్చారు. గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా రామవరం సెంటర్ నుండి గణేష్ చమన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే పాటలు, డప్పు చప్పుళ్లతో యువతకు, ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ముందుగా రామవరం సెంటర్‌లో విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో అవగాహన ర్యాలీగా బయలుదేరి చమన్‌కు చేరుకున్నారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ నుండి వచ్చిన ఈగల్ టీమ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ హాజరై డ్రగ్స్ మరియు గంజాయి వల్ల సమాజానికి కలిగే ప్రమాదాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామవరం టూ టౌన్ సీఐ డీ. ప్రతాప్ మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం




చేయడమే కాకుండా కుటుంబాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నేటి సమాజంలో చాలామంది యువకులు క్షణికానందం కోసం మత్తుకు బానిసలై తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే డ్రగ్స్ బారిన పడి ఎంతోమంది యువకులు జైలు పాలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల వారి కుటుంబాలు కూడా తీవ్రంగా బాధపడుతున్నాయని పేర్కొన్నారు. కేవలం తాము దూరంగా ఉండటమే కాకుండా, తోటి వారు కూడా ఈ అలవాట్ల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి, యువకుడిపై ఉందని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి ప్రవర్తన, స్నేహితుల వర్గం, బయటకు వెళ్లే సమయాలపై పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. పిల్లలు అనుమానాస్పద వ్యక్తులతో కలవడం లేదా మత్తు పదార్థాల వినియోగానికి లోనవుతున్నట్లు అనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ఈగల్ ఫోర్స్ నుంచి వచ్చిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కాలంలో డ్రగ్స్ మరియు గంజాయి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ బృందం రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ రవాణా, అమ్మకాలు మరియు వినియోగాన్ని గుర్తించి అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుందని ఆయన హెచ్చరించారు. గంజాయి లేదా డ్రగ్స్ వినియోగం కేవలం ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలకు, సమాజానికి కూడా తీవ్రమైన నష్టం కలిగిస్తుందని చెప్పారు. అందువల్ల యువత ఈ అలవాట్లకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని



సూచించారు. అలాగే సైబర్ క్రైమ్ గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం చాలా మంది సైబర్ మోసాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడగడం, లింకులు పంపించడం వంటి మోసపూరిత చర్యలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పకూడదని, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. పోలీసులు డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించడం సాధ్యం కాదని అధికారులు తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ పరిసరాల్లో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రామవరం ప్రాంతాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రజలు, విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు మరియు పోలీసులు అందరూ కలిసి పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ కిషోర్, మనీషా, ఇతర పోలీస్ అధికారులు, స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, హైస్కూల్ విద్యార్థులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన

### ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడమే లక్ష్యం

### నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట ప్రతినిధి మార్చ్ 12( విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో నిర్వహించిన “డయల్ యువర్ ఎస్పీ” కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారులు స్వయంగా ఎస్పీకి ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా వివరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 21 ఫోన్ కాల్స్ వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ ప్రాంతాల్లో ముందస్తు దొంగతనాల నివారణ కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని కోరారు. భూ తగాదాలకు సంబంధించిన సమస్యలు రావడం జరిగింది, గతంలో జరిగిన దొంగతన కేసుల్లో నిందితులను ఇప్పటివరకు పట్టుకోలేదని కొందరు ఫిర్యాదు చేశారు. అలాగే కోస్గి పట్టణంలో సంత రోజుల్లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా అవుతుందని, పోయిన సెల్ ఫోన్లు ఇప్పటివరకు ట్రేస్ కాలేదని, కొన్ని



పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినప్పుడు సరైన స్పందన ఇవ్వడం లేదని కూడా పలువురు తమ సమస్యలను తెలియజేశారు. ఈ సమస్యలన్నింటినీ జిల్లా ఎస్పీ స్వయంగా నోట్ చేసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ అధికారుల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల పక్షానే పనిచేస్తుందని, ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాలను తరచూ నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## జాతీయ మహిళా కమిషన్ మీ చెంతకే‘

### -జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్

మల్కాజిగిరి, మార్చి 12,(విజన్ ఆంధ్ర): జాతీయ మహిళా కమీషన్ కు దేశ నలుమూల ల నుండి ఎన్నో ఫిర్యాదులు అందుతాయని, వారందరు ఢిల్లీ వరకు రాలేరని, ఈ మహిళ జన్ సున్వాయ్ కార్యక్రమం ద్వారా మహిళల సమస్యలను పరిష్కరించడానికి ‘జాతీయ మహిళా కమీషన్ మీ చెంతకే‘ వచ్చిందని జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్ అన్నారు. గురువారం మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి డిజిపి శివధర్ రెడ్డి, అడిషనల్ డిజిపి చారుసిన్హా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి సిపి అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటి కమీషనర్ సుధీర్ బాబు, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ (ఎన్ సీ డబ్ల్యూ) ద్వారా జరుగుతున్న ఈ ‘మహిళా జన్ సున్వాయ్‘ (ప్రజా విచారణ) కార్యక్రమానికి మల్కాజిగిరి, హైదరాబాద్ యంత్రాంగం అంతా ముందుకు వచ్చి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ మహిళా కమిషన్, స్థానిక యంత్రాంగం కలిసి పని చేస్తే, మహిళల సమస్య లకు ఖచ్చితంగా త్వరగా న్యాయం జరుగుతుంద న్నారు. దేశం నలుమూలల నుండి మాకు ఎన్నో ఫిర్యాదులు అందుతుంటా యని, కానీ చాలా మంది మహిళలు ఢిల్లీ వరకు రాలే రని, అందుకే మేమే వారి వద్దకు వెళ్లాలని నిర్ణయించు కొని ‘జాతీయ మహిళా కమిషన్ మీ చెంతకు‘ అనే ఈ కార్యక్రమం ప్రారంభించి




ఇప్పటివరకు మేము దాదాపు 100 జన సున్వాయ్ కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒకేసారి దేశవ్యాప్తంగా సుమారు 500 జిల్లాల్లో ఈ విచారణలు నిర్వహించాలని నిర్ణయించుకొని, దీని ద్వారా సుమారు 15 నుండి 20 వేల కేసులను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ రోజు ఇక్కడ కూడా చాలా మంది మహిళలకు న్యాయం జరుగుతుందని అంటున్నారని, వారు సంతోషంగా ఇంటికి వెళ్తారని ఆశిస్తున్నానన్నారు. మల్కాజిగిరి సిపి ఆఫీస్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 కేసుల హియరింగ్ జరిగిందని, అతి త్వరగా పరిశీలించి పరిష్కరి స్తామని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, మల్కాజిగిరి ఎంఆర్ఓ సీతారాం, డిడబ్ల్యూఓ శారద, డిఆర్డిఓ సాంబశివరావు, డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరి, జిల్లా మైనారిటి అధికారి కాంతమ్మ, జిల్లా హౌజింగ్ అధికారి రమణమూర్తి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

### బాసర మండల విద్యాధికారి జి. మైసాజీ



బాసర :మార్చ్ 12:విజన్ ఆంధ్ర.పదో తరగతి వార్షిక పరీక్షలకు విస్తృత ఏర్పాటు చేసినట్లు బాసర మండల విద్యాధికారి జి. మైసాజీ తెలిపారు. ఈనెల 14 నుండి జరిగే పదవ తరగతి పరీక్షలకు బాసరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న 190 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరిగిందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడంతో పాటు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య వైద్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు తగిన ఫర్నిచర్, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలలో పారదర్శకత కొరకు సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో హాల్ టికెట్లను సైతం పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు.

## విద్యార్థినిలకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

### -జిల్లా కలెక్టర్ కె. హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి(విజన్ ఆంధ్ర): విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జారి చేసిన మెను ప్రకారం భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలను కలెక్టర్ కె.హరిత ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలను, వంటగదిని, సరుకుల నిల్వ గదిని, తరగతి గదులను పరిశీలించారు. వంటశాల పరిశుభ్రంగా ఉండే విధంగా, సరుకులు క్రమ పద్దతిగా ఉంచాలన్నారు. మెను పట్టికను పరిశీలించి మెనూలో పేర్కొన్న విధంగా అందిస్తున్నారా, అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు మెనూలో ఉన్న ప్రకారం ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా అల్పాహారం వడ్డించి విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతు విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యతను ప్రదర్శించి జిల్లాకు వన్నె తీసుకురావాలన్నారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థినుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలో అనేక వసతులు కల్పించిందన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను భారీగా పెంచిందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని, ఉన్నత స్థానంలో ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### ధైర్యంగా ఉండండి అండగా ఉంటాం

### మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆదేశం



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,మార్చి 12, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని సోంపల్లి గ్రామస్తులకు నిర్మల్ జిల్లా కొండాపూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన సందర్భంగా ఇద్దరు మృతి చెందగా మిగితా 21 మందికి తీవ్ర గాయాలవగా వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇట్టి విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తక్షణమే రిమ్స్ ఆసుపత్రికి చేరుకొని వారిని పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జేసింగ్ రాథోడ్ ని ఆదేశించారు. ఎవరు అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. వీరి వెంట ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధింపు

### -పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ నీతిక పంత్ వెల్లడి



కాగజ్ నగర్/ఆసిఫాబాద్(విజన్ ఆంధ్ర):కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి (ఎస్ఎస్సి) వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీచీూా ▪ 2023) సెక్షన్ 163 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 38 పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ ఆంక్షలు మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు పరీక్షలు జరిగే ప్రతి రోజూ ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు అమలులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు తీసుకురావడం నేరంగా పరిగణించబడుతుంది. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షునికి బిజెపి అధికార ప్రతినిధిగా కప్పర ప్రసాద్ రావుకు నియామకం

### బిజెపికి సారు చేసిన సేవల వలన గుర్తింపు వచ్చింది ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు దేవులపల్లి ఎల్లయ్య

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర )మార్చ్ 12బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీ అధిష్ఠానం నియామకంవిద్యార్థి ఉద్యమాల నుంచి రాజకీయ, మీడియా రంగాల్లో విశేష ప్రస్థానంజర్నలిస్టుగా పలు పత్రికలు, టీవీ ఛానళ్లలో కీలక బాధ్యతలుపార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్రకగుర్తింపుగా పదవి..తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గా పలు పోరాటాలుసిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కప్పర ప్రసాద్ రావును భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించింది. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, క్షేత్రస్థాయిలో చేసిన కృషిని గుర్తించిన బీజేపీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. విద్యార్థి దశలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న కప్పర ప్రసాద్ రావు, సామాజిక-రాజకీయ అంశాలపై అవగాహన పెంపొందించుకుంటూ బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. అదే సమయంలో జర్నలిజంపై ఆసక్తితో మీడియా రంగంలో అడుగుపెట్టి పలు పత్రికలు, టెలివిజన్ ఛానళ్లలో వివిధ హోదాల్లో సేవలందించారు. ఈనాడు, వార్త, సూర్య పత్రికల్లో పనిచేసిన ఆయన అనంతరం టీవీ5లో స్పెషల్ కరస్పాండెంట్‌గా, హెచ్ఎంటీవీలో తెలంగాణ ఇన్‌చార్జిగా, రాజ్ న్యూస్‌లో ఇన్‌పుట్ ఎడిటర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం జర్నలిజంపై మక్కువతో 'జర్నలిస్ట్ టీవీ' సీఈవోగాకొనసా గుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా ఆయన చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేస్తూ జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడారు. రాజకీయంగా కూడా పార్టీ ఇచ్చిన బాధ్యతలను



సమర్థంగా నిర్వర్తిస్తూ బీజేపీలో విశ్వసనీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. బీజేపీ మానవ హక్కుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఐదేళ్లకు పైగా సేవలందించిన ఆయన, అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన బండారు దత్తాత్రేయ, జి. కిషన్ రెడ్డి, డాక్టర్ కె. లక్ష్మణ్, బండి సంజయ్ కుమార్ వంటి నాయకులకు ఆయన ఆప్తుడిగా ఉండగా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు కూడా విశ్వాసపాత్రుడిగా కొనసాగుతున్నారబీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీ అధిష్ఠానం నియామకంవిద్యార్థి ఉద్యమాల నుంచి రాజకీయ, మీడియా రంగాల్లో విశేష ప్రస్థానంజర్నలిస్టుగా పలు పత్రికలు, టీవీ ఛానళ్లలో కీలక బాధ్యతలుపార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్రకు గుర్తింపుగా పదవి..తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గా పలు పరాటాలు సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కప్పర ప్రసాద్ రావును భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించింది. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, క్షేత్రస్థాయిలో చేసిన కృషిని గుర్తించిన బీజేపీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. విద్యార్థి దశలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న కప్పర ప్రసాద్ రావు, సామాజిక-రాజకీయ అంశాలపై అవగాహన పెంపొందించుకుంటూ బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. అదే సమయంలో జర్నలిజంపై ఆసక్తితో మీడియా రంగంలో అడుగుపెట్టి పలు పత్రికలు, టెలివిజన్ ఛానళ్లలో వివిధ హోదాల్లో సేవలందించారు. ఈనాడు, వార్త, సూర్య పత్రికల్లో పనిచేసిన ఆయన అనంతరం టీవీ5లో స్పెషల్ కరస్పాండెంట్‌గా, హెచ్ఎంటీవీలో తెలంగాణ ఇన్‌చార్జిగా, రాజ్ న్యూస్‌లో ఇన్‌పుట్ ఎడిటర్‌గా కీలకబాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం జర్నలిజంపై మక్కువతో 'జర్నలిస్ట్ టీవీ' సీఈవోగాకొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా ఆయన చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేస్తూ జర్నలిస్టుల అందర్నీ బస్సు యాత్ర ద్వారా 33 జిల్లాలు తిరిగి అటు ప్రజల ఇటు జర్నలిస్టుల యొక్క రైతుల సమస్యలపై కదం తొక్కిన ఏకైక యూనియన్ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్సభ్యులందరికీ కలుపుకొని తెలంగాణ రాష్ట్రం మొత్తం చుట్టిముట్టిన ఘనత ఆయనదేఅనిచెప్పుకోవచ్చు . హక్కుల కోసం పోరాడారు. రాజకీయంగా కూడా పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ బీజేపీలో విశ్వసనీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. బీజేపీ మానవ హక్కుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఐదేళ్లకు పైగా సేవలందించిన ఆయన, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గమైన గజ్వేల్ నుండి పార్లమెంట్ మరియు అసెంబ్లీ ఎలక్షన్లో ప్రచార రథకుడిగా పనిచేసే బిజెపి పార్టీని ప్రజలకు అతి చెరువులోకితీసుకుపోయినటువంటి ప్రధమ వ్యక్తి కప్పర ప్రసాద్ రావు అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన బండారు దత్తాత్రేయ, జి. కిషన్ రెడ్డి, డాక్టర్ కె. లక్ష్మణ్, బండి సంజయ్ కుమార్ వంటి నాయకులకు ఆయన ఆప్తుడిగా ఉండగా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు కూడా విశ్వాసపాత్రుడిగా కొనసాగుతున్నారు. తిగుల్ గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అందుకోవడం పట్ల స్థానికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బెల్టు షాపులకు అండగా వైన్స్

అనంతగిరి, మార్చి 12 (విజన్ ఆంధ్ర):గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల దందా జోరుగా పెరుగుతుంది. ఏ గ్రామంలో అయినా మెడికల్ షాప్ ఉంటుందో లేదో కానీ వీధికొక బెల్ట్ షాప్ మాత్రం ఉంటుందంటే ఎంత భారీ ఎత్తున మద్యం అమ్మకాలు జరుగుతున్నాయో ఊహించవచ్చు. ఎలక్షన్ల సమయంలో బెల్ట్ షాపులపై నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు తర్వాత వారికి సహకరించినట్టుగా పనిచేస్తున్నారు. ఇది అదునుగా భావించిన బెల్ట్ షాప్ నిర్వాహకులు ఇష్టానుసారుగా మద్యాన్ని అమ్ముతున్నారు. దీనికి తోడు వీరికి వైన్ షాప్ నిర్వాహకులు కూడా సపోర్ట్ చేయడం విడ్డూరం. ప్రోత్సహిస్తున్న వైన్స్ నిర్వాహకులు. అనంతగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ లైసెన్సు అధికారకంగా ఇచ్చిన ఉన్న వైన్ షాప్ ఉంది. దీని ద్వారా మండలంలో వినియోగదారులకు మద్యం సరఫరా చేయాలి. ఈ మేరకు వైన్స్ లకు వెళ్లలేని వారు రాత్రి వైన్ షాపులు లేని సమయంలో మద్యం అవసరం ఉన్నవారు స్థానిక బెల్ట్ షాపుల్లోనే మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వీరికి వైన్స్ నిర్వాహకులు కొండంత అండగా ఉంటున్నారు. మీ దగ్గరికి ఎవరూ రారు మేము చూసుకుంటాం అని భరోసా ఇస్తున్నారనే చర్చలు వినిపిస్తున్నాయి. అందుకుగాను ఒక్కో బీరు సీసాపై పది రూపాయలు, మద్యం బాటిల్ పై పది నుంచి 30 వరకు వసూలు చేస్తున్నారని వినికిడి. బెల్ట్ షాపుల నిర్వాహకులు వినియోగదారుల నుంచి 30 నుండి 50 వరకు వసూలు చేస్తున్నారు. ఈనేపధ్యంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పుట్టుకొస్తున్నాయి. మద్యం మయంగా గ్రామాలు మారుతున్నాయి. ప్రత్యేక అమ్మకం విధానం. బెల్ట్ షాపు అమ్మకాలకు వైన్స్ లో ప్రత్యేక అమ్మకం విధానాన్ని కూడా ప్రవేశపెట్టారని అర్థం చేసుకోవచ్చు. ఈ బెల్ట్ షాపుల నిర్వాహకులకు మద్యం అమ్మేందుకు వైన్స్ లో స్పెషల్



కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, సాధారణంగా వినియోగదారులకు ఇచ్చే కౌంటర్ తో పాటు పక్కనే ప్రత్యేక షట్టర్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. చట్టపరంగా ఒక వ్యక్తికి పరిమితి స్థాయిలోనే మద్యం అమ్మాలి కానీ బెల్ట్ షాపు నిర్వాహకుల నుంచి అక్రమంగా వసూలు చేసుకుని ఎన్నంటే అన్ని కాటన్ లు మద్యం సీసాలు ఇచ్చేస్తున్నారు. వీరు ఇస్తున్న అండతో గ్రామాల్లో విచ్చలవిడి అమ్మకాలు యదేచ్చగా కొనసాగుతున్నాయి. మండల వ్యాప్తంగా పెద్ద పెద్ద గ్రామాల్లో ఒక్కో గ్రామానికి 10 పైనే బెల్ట్ షాపులు ఉండగా చిన్న గ్రామాల్లో సైతం నాలుగైదు దుకాణాలు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే వేల రూపాయల కాటన్ల మద్యం గ్రామాల్లో విక్రయాలు జరుగుతున్నాయి. బెల్ట్ షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా వైన్స్ నిర్వాహకులు కూడా సపోర్ట్ చేయడం చర్చనీయాంశం. కిరాణా కొట్టే బెల్ట్ షాప్. ప్రత్యేకంగా గ్రామాల్లో కిరాణా కొట్టులు నిత్యవసర సరుకులు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసుకుంటారు. వాటిని బెల్ట్ షాపులు గా మార్చి విక్రయాలు జరుపుతున్నారు. ఒకప్పుడు బెల్ట్ షాపులు గ్రామానికి రెండు మూడు ఉండేవి వాటిని కూడా భయం భయంగా నిర్వాహకులు నిర్వహించేవారు. కానీ నేడు విచ్చలవిడిగా పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. బెల్ట్ షాపులు అంటే మద్యం దుకాణాలు లాగా కనిపించవు కిరాణా షాపులు మాదిరిగానే ఏర్పాటుచేసి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఏ రాత్రి సమయంలో వెళ్లిన వినియోగదారులకు బెల్ట్ షాపులో మద్యం లభిస్తుంది. ఎన్నికల సమయంలో అడపాదడపా దాడులు చేసే ఆప్కారి శాఖ, పోలీస్ శాఖ తర్వాత కన్నెత్తి బెల్ట్ షాపులపై దృష్టి పెట్టకపోవడంతో ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు గ్రామాల్లో జోరందుకున్నాయి. **ఓధికారులు చర్యలు తీసుకోవాలి.** గ్రామాల్లో మద్యం మత్తులో అర్ధరాత్రి వేళల్లో గొడవలు జరిగిన సందర్భాలు కూడా మండల వ్యాప్తంగా చాలా వరకు చూశాం. వైన్స్ రాత్రి 10 గంటలకు మూసి వేయడంతో మందుబాబులు బెల్ట్ షాపుల్లో కొనుగోలు చేయడానికి వచ్చి తరచూ గొడవలు సృష్టిస్తున్నారు. ఆయా షాపుల పక్కనున్న కుటుంబాలకు కూడా ఇబ్బందులు కలిగేలా మద్యం బాబులు వ్యవహరిస్తున్నారు. ఇటీవల మండల వ్యాప్తంగా జరిగిన పలు జాతర్ల కార్యక్రమాలలో మద్యం సేవించి గొడవలు జరిగిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. ఈ మేరకు స్థానికంగా ఉన్న కొందరు మద్యం షాపులపై చర్యలు తీసుకొని వాటిని నిర్మూలించి ప్రశాంతత కల్పించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు. ఏది ఏమైనా మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా వైన్స్ నిర్వాహకుల అండదండలతో నడుపుతున్న బెల్ట్ షాపులు పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పరిమితికి మించి మద్యం అమ్మకూడదు అనే విధంగా వైన్స్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేయాలని మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు కోరుతున్నారు.

## ములుగు పట్టణంలో ఎరుసు నరసింహారావు సంతాప సభ





ములుగు మార్చి 12;విజన్ ఆంధ్ర ప్రతినిధి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం ములుగు పట్టణ సీనియర్ నాయకులు ఎర్సు నరసింహారావు ఇటీవల మరణించగా ఆయన పెద్దకర్మలు (మార్క్సిస్ట్) సిపిఎం ములుగు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన గృహం నందు సంతాప సభ నిర్వహించి నరసింహ రావు కు జోహార్లు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి ,యం.సి.పి.ఐ.యు జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య లు మాట్లాడుతూ ములుగు తాలూకా ప్రజా పోరాటాలకు పునాది వేసి ఎంతోమంది ప్రజలు ,కార్మికులు బడుగు బలహీన వర్గాల సమస్యల మీద పోరాటాలు చేసిన నాయకుడు నరసింహారావు అన్నారు. ఎంతోమంది ప్రజానీకం ములుగు పట్టణ కేంద్రానికి అనేక పనుల రీత్యా వచ్చినప్పుడు వారి యొక్క సమస్యలను తన సొంత సమస్యగా భావించి ప్రతి సమస్యకు ముందుండి ఆయన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడుతూ ఆయన పోరాటాల త్యాగాల వల్లనే ఈరోజు ఇక్కడ పార్టీ నిలిచిందన్నారు. ఆయన మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ,కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## రంజాన్ మాసం పర్వదినం పురస్కరించుకొని బట్టల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి. మార్చి 12: (విజన్ ఆంధ్ర)రంజాన్ మాసం పర్వదినం ను పురస్కరించుకుని మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, నవభారత్ నగర్ కాలనీలలో జరిగిన బట్టల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు బట్టలను పంపిణి చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దెైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ను పురస్కరించుకుని ముస్లిం సోదరి సోదర మణులకు పండుగను ధనిక ,పేద బేధం లేకుండా సుఖసంతోషాలతో జరుపుకునేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో బట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగినది అని, వారి కుటుంబాలలో సంతోషం వెల్లివిరియాలనే ఉద్దేశ్యంతో బట్టల పంపిణీ చేపట్టడం జరిగినది అని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాలను సమానంగా చూస్తున్నారు అని, రంజాన్ మాసం ఉపవాసం తో మంచి తనం ,సంస్కారం అలవడుతుందని ,మతసామరస్యానికి ప్రతీక ,అందరూ కల్సి ఉండాలని , ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగినది అని,పేద ముస్లిం కుటుంబాలకు పండుగ రోజున వెలితి లేకుండా, వారికీ ఎటువంటి లోటులేకుండా పండుగను సంతోషకరంగా జరుపుకోవాలని తెలిపారుఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, అబ్దుల్ రహమాన్,ఆఫ్రోజ్, అంకారావు,సాదిక్,సత్యం గుప్తా, హరిక్రిష్ణ మరియు కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు మరియు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

### ..జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,మార్చి 12, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్ లో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సర్పంచ్లు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆదిలాబాదు, బోథ్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారుముందుగా జిల్లాలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ (రైతు భరోసా, రుణమాఫీ), విద్యాశాఖ (అమ్మ ఆదర్శ పాఠశాల), ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమం, అటవీ శాఖ ద్వారా పర్యావరణ పరిరక్షణపై సంబంధిత, ఇతర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ..... జిల్లాలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని, ఈ ప్రత్యేక కార్యక్రమం మార్చి 6న ప్రారంభమై జూన్ 12 వరకు కొనసాగుతుందని అన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని,




గ్రామ, వార్డు స్థాయిలో పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, వార్డుల్లో వార్డు సభలు నిర్వహించి, అభివృద్ధి పనులపై సమీక్ష జరపాలని ఆదేశించారు. ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు పరిశుభ్రతలో భాగంగా గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్. మే 4 నుండి 9 వరకు రైతు సంక్షేమంలో భాగంగా వ్యవసాయం, రెవెన్యూ, నీటి పారుదల శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి, పిల్లల రక్షణ 'డ్రగ్స్ కు నో' ప్రచారం, విద్య, యువత-క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటివి అమలు చేయడం జరుగుతుందని వివరించారు. కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లకు ఇది మొదటి శిక్షణ అని, సర్పంచులు, కౌన్సిలర్లు సమన్వయంతో పని చేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఆదిలాబాదు శాసన సభ్యులు పాయల శంకర్ మాట్లాడుతూ..... సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ మాట్లాడుతూ....., ప్రజా ప్రతినిధులు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మనం చేసిన పనుల ఆధారంగానే ప్రజలు భవిష్యత్తులో మనల్ని ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం రైతులకు ఉచితంగా అందించేందుకు 500 రూపాయల విలువగల ఐదు రకాల కూరగాయల విత్తనాల కిట్ ను కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, డిఆర్డీఓ రవీందర్, డిపిఓ రమేష్, అదనపు ఎస్పీలు సురేందర్ రావు, మౌనిక, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, సర్పంచ్ లు, మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటాం కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం బ్యూరో మార్చి 13(విజన్ ఆంధ్ర)జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు, గ్యాస్ సిలిండలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. గురువారం ఐడీఓసి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ, పౌరసరఫరాల శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి సంబంధించిన సాగుభూమి వివరాలు, ప్రస్తుత సాగు పరిస్థితులు, ప్రధాన పంటల వివరాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతుభరోసా, రైతు భీమా పథకాల అమలు, లబ్ధిదారుల సంఖ్య, రైతులకు అందుతున్న ప్రయోజనాలపై సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో పంటల వారీగా సాగు విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అధికారులకు అడిగి తెలుసుకున్నారు ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నీటి వనరులు, చెరువులు, కాలువలు, ప్రాజెక్టులు, వాటి పరిధిలోని ఆయకట్టు విస్తీర్ణం,



సాగునీటి లభ్యత తదితర అంశాలపై సమగ్ర సమాచారం తెలుసుకొని,జిల్లాలో సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు అవసరమైన నీటిని సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి జిల్లాలో పనిచేస్తున్న రేషన్ దుకాణాల సంఖ్య, లబ్ధిదారులకు అందుతున్న సన్నబియ్యం పంపిణీ వివరాలు, నిల్వలు, సరఫరా పరిస్థితులపై కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమయానికి నాణ్యమైన రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు . ఈ సందర్భంగా జిల్లాలో గ్యాస్ నిల్వల పరిస్థితిపై కూడా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ, వినియోగదారులు కొరత ఏర్పడుతుందనే భయంతో ముందుగానే అధిక మొత్తంలో బుకింగ్ చేయడం వల్ల కొన్నిచోట్ల తాత్కాలిక సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. అలాగే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం వంటి చర్యలను కట్టడి చేయడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్యాస్‌ను అక్రమంగా నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల మేనేజర్ త్రినాధ్ బాబు,ఇరేగేషన్ ఈ ఈ అర్జునరావు, ఇరేగేషన్ శాఖ ఏ ఈ లు, సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఊట్కూర్ లో ఈనెల 25న హిందూ సమ్మేళనం

ఊట్కూర్, మార్చి 12 (విజన్ ఆంధ్ర) ఊట్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో మార్చి 25న హిందూసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు సిరిగిరి చందూలాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సంఘేశక్తికలౌయుగే భారతదేశముకు ఆత్మ, ప్రాణం హిందూధర్మం అలాంటి హిందూ ధర్మంను చైతన్య పరచుటకు మరియు విశ్వ గురువుగా నిర్మాణం చేయాలని లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని తెలిపారు.లక్ష్యసాధనలో భాగంగా హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఊట్కూర్ ఖండ లో ఊట్కూర్ ఉప మండల హిందూ సమ్మేళనంఇందులో 10 గ్రామాల నుండి హిందూ బంధువులు కుటుంబాలతో గ్రామాల నుండి కోలాటం, భజన, వేషాధారణ,నినాదాలతో పెద్ద ఎత్తున ఈ హిందూ సమ్మేళనంలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. హిందూ సమ్మేళన ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా సిరిగిరి చందులాల్ , ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ గౌడ్ , కోశాధికారిగా భాస్కర్ తో పాటు 20 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా శ్రీ స్వామి అనంతానంద భారతి పురాణపీఠం,అనంతసాహితీ ఆశ్రమం హైదరాబాద్ ముఖ్య వక్తగాభాగయ్య, అఖిల భారతీయ కార్యకారిణి సదస్సులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. హిందూ సమ్మేళనం అధ్యక్షులు చందులాల్.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికతోనే జిల్లా సమగ్రాభివృద్ధి: కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ :మార్చ్ 12:విజన్ ఆంధ్ర నిర్మల్ జిల్లాలో "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక"ను పకడ్బందీగా అమలు చేసి, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అద్భుతమైన ప్రగతిని సాధిద్దామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్ల కోసం నిర్వహించిన అవగాహన సదస్సు అత్యంత అట్టహాసంగా జరిగింది. ఈ సదస్సులో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. **99 రోజుల ప్రత్యేక కార్యాచరణ** ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ చేరాలనే ఉద్దేశంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికలో భాగంగా జిల్లాలో పారిశుధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల అనారోగ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్ మరియు మున్సిపల్ చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని




ఆమె సూచించారు. **ప్రజాప్రతినిధులు – అధికారుల సమన్వయం**
నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించినందుకు ప్రజాప్రతినిధులు గర్వపడాలని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కోరారు. ముఖ్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ 99 రోజుల ప్రణాళికలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో యువత ప్రాతినిధ్యం పెరగడం వల్ల గ్రామాల్లో నూతనోత్సాహం కనిపిస్తోందని, ప్రభుత్వ పథకాల అమలులో యువ ప్రతినిధులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**గ్రామ వికాసంలో సర్పంచుల పాత్ర**

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే ప్రధాన పాత్ర అని, వారు ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రతి నెలా గ్రామసభలు నిర్వహించి, స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాకు మరిన్ని నిధులు తీసుకురావడంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం పెంబి ఆస్పిరేషన్ బ్లాక్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దిన ప్రజాప్రతినిధులను, రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ మరియు ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, డిఎల్ఎస్ఏ సెక్రటరీ రాధికతో పాటు పెద్ద సంఖ్యలో సర్పంచులు, కౌన్సిలర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్ :మార్చ్ 12:విజన్ ఆంధ్ర నిర్మల్ జిల్లా కొండాపూర్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గురువారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆమె, వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపల్లి గ్రామం నుండి ఆర్మూర్‌లో జరగనున్న వివాహ వేడుకకు 21 మంది ప్రయాణికులతో వెళ్తున్న బొలెరో మ్యాక్స్ ఐచర్ వాహనం, కొండాపూర్ సమీపంలో ప్రమాదానికి గురైంది. ఒక్కసారిగా వాహనం టైర్ పగిలిపోవడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలోని 21 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో స్పందన – ఇద్దరి మృతిప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సమన్వయంతో స్పందించి అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, దురదృష్టవశాత్తూ ఈ ఘటనలో లక్ష్మణ్ (60), తులసీ దాస్ (38) తీవ్ర గాయాలతో మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ (=×మీా) ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారు ప్రస్తుతం నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబాలకు భరోసాఆసుపత్రికి చేరుకున్న ఎస్పీ డా. జి. జానకి షర్మిల బాధితులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో పోలీసులు అన్ని విధాలుగా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. అత్యవసర వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

## జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



గద్వాల మార్చి 12(విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల్ జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి (ఎస్ఎస్‌సి) వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలు కట్టుదిట్టం చేయడానికి భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్ 2023) సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు. 14 మార్చి 2026 నుండి 16 ఏప్రిల్ 2026 వరకు పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు తీసుకురావడం పూర్తిగా నిషేధం. అదేవిధంగా పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు హెచ్చరించారు.

# రంజాన్ స్ఫూర్తి సామరస్యాన్ని చాటిన ఇఫ్తార్ విందు




ఖమ్మం, మార్చి 12 (విజన్ ఆంధ్ర) రంజాన్ మాసం ఆధ్యాత్మికత, సహనం మరియు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్న నేపథ్యంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం ఆధ్వర్యంలో స్థానిక జెఐహెచ్ ప్రధాన కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిసిపి (అడ్మిన్) బి. రామానుజం, అడిషనల్ ఎస్పీ (ఇంటెలిజెన్స్) రామోజీ రమేష్ హాజరయ్యారు. రంజాన్ మాసం మనిషిలో ఆత్మశుద్ధి, సేవాభావం మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్ర కాలమని వారు పేర్కొన్నారు. సమాజం లో శాంతి, సౌహార్దం, సహనాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం అతిథులు ఉపవాసం విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి ఎండి ముజాహిద్, జేఐహెచ్ జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, సెంట్రల్ యూనిట్ అధ్యక్షులు ఇంతియాజ్, ఖమ్మం పౌరసమితి అధ్యక్షులు పులిపాటి ప్రసాద్, ఎంపీజే జిల్లా కోశాధికారి ఎండి హకీమ్, బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్రు నాయక్, దక్షిణ మధ్య రైల్వే మాజీ బోర్డు మెంబర్ మట్టా దుర్గాప్రసాద్, ఐటా కార్యదర్శి ముజీబ్, ఆర్పివి అధ్యక్షులు సంజీవరావు, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ కార్యదర్శి రఫీక్, మీడియా కన్వీనర్ టి. సంతోష్ చక్రవర్తి, సేవా బ్యాంక్ మేనేజర్ ఎం.డి. రఫీ, ఎంపీజే సభ్యులు అహ్మద్ పాషా, ఖాజా మొహిద్దిన్, అర్షిన్, గౌస్, రజాక్, ఇలియాస్, ఇస్మాయిల్, ఫయాజ్, మతీన్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

## తెలంగాణ బీ.సీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్




విజన్ ఆంధ్ర (12)హైదరాబాద్తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జూన్ 12 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతీ శ్రీకాంత్ గౌడ్ అధికారులను కోరారు. గురువారం నాడు దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ బీసీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి, ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం అందులో ఒక భాగం అని 99 రోజుల కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అందరినీ భాగ స్వాములను చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పథకాలను కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు, పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ప్రతిరోజు పార్కులకు వచ్చే వాకర్లు ఈ ప్రత్యేక పరిశుభ్ర కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు, మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు, వేసవి ప్రారంభమైందని దీనితో పాటు దోమల బెడద కూడా ప్రారంభమైంది కావున పారిశుద్ధ్య కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు, రోడ్ల, డ్రైన్ల, అంగన్ వాడిలు, మార్కెట్లు, హాస్టళ్ళు, బస్టాండ్లలో శుభ్రత, రోడ్ల వెంట ఖాళీ ప్రదేశాలలో చెట్లపొదలు తొలగింపు వంటి పనులు ఇందులో భాగం గా ఉంటాయని, రెవిన్యూ ఆగ్ మెంటేషన్ కింద కొత్త ఇండ్లు, పరిశ్రమలు, కమర్షియల్ భవనాల అసెస్మెంట్, ట్రేడ్ లైసెన్స్ జారీ, మార్కెట్లు షాపింగ్ కాంప్లెక్స్ వేలం పూర్తి 100% టాక్స్ ల వసూళ్లు ఇతర ఫీజులు వసూళ్ళు, 2026- 27 సంవత్సరానికి టాక్స్ల నిర్ధారణ, పంచాయతీలు, అంగన్ వాడీ భవనాలు, సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులు, చేపడతారని వివరించారు, తాగునీటికి సంబంధించిన పైపుల రిపేర్, పైపులతో కొత్త కనెక్షన్లు వంటివి గుర్తింపు వాటి రిపేర్లు కొత్త కనెక్షన్లకు మెటీరియల్ సేకరణపై కార్యాచరణ ప్రణాళిక అధికారులు తయారు చేస్తారని, పంచాయతీ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఇతర వనరుల గుర్తింపు పూర్తి చేస్తారని అన్నారు, అన్ని ఇళ్లలో ద్రవ, ఘన, వ్యర్థాలను విడదీసి సేకరించే పని ప్రతి గ్రామ పంచాయతిది అని కంపోస్టు ఎరువు తయారీ వరద నిర్వహణ పద్ధతులపై శిక్షణ, ఈవేస్ట్, బయో మెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్, సేకరణ సురక్షితంగా డిస్పోజ్ చేయడం ద్రవ్య వ్యర్థాల నిర్వహణ చర్యలు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సు , ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల వంటి వాటిని చేపడుతారని, ఉపాధి హామీ అమలు తీరు చేపట్టిన పనులను పరిశీలిస్తారని వర్షాకాల సన్నద్ధతలో భాగంగా వరద నీటి కాలువల డిసిల్టింగ్ లోతట్టు ప్రాంతాల ఫీలింగ్ యాంటీ లార్వా కెమికల్స్, ఫాగింగ్ స్ప్రే, శుక్రవారం డ్రై డే పాటింపు ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం, వాటికోసం స్థలాల గుర్తింపు, మొక్కలు నాటడం వంటి పనులు చెయ్యాలని అన్నారు, నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అనూహ్య స్పందన లభించింది, బీసీ కార్పొరేషన్ కు సంబంధించిన అన్ని పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని అందుకు కావలసిన కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో బీసీ కమిషనర్ శ్రీమతి బాల మాయాదేవి, ఎండి మల్లయ్య భట్టు, సీఈఓ అలోక్ కుమార్, ఎం.డి.లు ఉదయ్ ప్రకాష్, శ్రీమతి ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలే ప్రధానం

**విద్యుత్ శాఖకు భారీ బడ్జెట్ కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**అన్నదాతల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించాలి**
**విద్యుత్ శాఖ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే మేఘారెడ్డి**



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి :తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా విద్యుత్ శాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే భారీ బడ్జెట్ కేటాయించిందని అందులో వనపర్తి నియోజకవర్గంలో శాశ్వతంగా విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ ముందుకు సాగుతున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మెగారెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ శాఖ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు విద్యుత్తు నియంత్రణలో ఏర్పాటు ,విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, విద్యుత్ లైన్ లో ఏర్పాటు పెబ్బేరు మున్సిపాలిటీలో చేపట్టిన రోడ్డు వెడల్పు లో భాగంగా విద్యుత్తు లైన్ లో ఏర్పాట్లు వంటి అంశాలను ఆయన సమీక్ష సమావేశంలో చర్చించారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని రైతులకు ఇలాంటి విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే విద్యుత్తు ఏఈలు చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే రైతులను గ్రామస్తులను నాయకులను అశ్రద్ధ వహించొద్దని వారి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు విద్యుత్ శాఖకు కేటాయిస్తుందని అధికారుల నిర్లక్ష్యం వల్ల చేస్తున్న అభివృద్ధి గుర్తింపు లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలాన్ని దృష్ట ఉంచుకొని ప్రతి ఒక్కరు నిబద్ధతతో విధులు నిర్వహించాలని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎండాకాలంలో ప్రధానంగా విద్యుత్ సమస్యతో రైతులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడకుండా రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాధవి, విద్యుత్ శాఖ అధికారులు సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ తిరుపతయ్య, డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, వెంకట శివరాం, ఏ డి ఈ శ్రీనివాస్, శంకర్ రెడ్డి తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ చైర్మన్ గా డాక్టర్ జే రామ్మోహన్



మహబూబ్ నగర్ రూరల్ మార్చి 13 విజన్ ఆంధ్ర టిపిసిసి అనుబంధమైన డాక్టర్స్, మెడికల్, హెల్త్ విభాగం జిల్లా చైర్మన్ గా డాక్టర్ జె రామ్మోహన్ నియమితులయ్యారు. టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ నియామక పత్రం జారీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ రామ్మోహన్ కు డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్ల కొత్వాల్ నియామక పత్రం అందజేశారు. జిల్లాలో డాక్టర్స్, మెడికల్ సెల్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, రాజేందర్ రెడ్డి, సీజే బెనహర్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, లింగం నాయక్, డాక్టర్ విజయ్ కాంత్, డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ రఘు సుప్రీత్, డాక్టర్ సంపత్ , మాజీ తహసిల్దార్ చెన్న కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ లైన్ ఫౌండేషన్ బ్యానర్ ఆవిష్కరణ




ఖమ్మం మార్చ్ 12 (విజన్ ఆంధ్ర)లైఫ్ లైన్ ఫౌండేషన్ బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమము ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీ మియా అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం క్యాంప్ ఆఫీస్ నందు జరిగినది, ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బ్యానర్ ను క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ శ్రీ తుంబూరి దయాకర్ రెడ్డి ఆవిష్కరించినారు, వారు మాట్లాడుతూ మంచి సేవ దృక్పథంతో స్థాపించబడిన ఈ సమస్త ముందు ముందు పేదలకు మంచి మంచి సేవ కార్యక్రమాలు చేయాలని కొనియాడినారు, ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తుంబూరి దయాకర్ రెడ్డిని సాల్వతో సత్కరించినారు, ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీ మియా మరియు సభ్యులు షేక్ ఇమ్రాన్, షేక్ మదర్ సాహెబ్, తేజావత్ నరసింహారావు, ఎండి. జుల్ఫీకర్అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ప్రశాంతంగాముగిసినఇంటర్ ప్రథమసంవత్సరపరీక్షలు

ఊట్కూర్, మార్చి12(విజన్ ఆంధ్ర) ఊట్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షకు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలకు ఏడు మంది విద్యార్థులు గైరాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సర సంవత్సర రసాయన వ్యాపార గనక శాస్త్రం పరీక్షలకు137 మంది విద్యార్థులకు గాను 6 మంది విద్యార్థులు పరీక్షలకు గైరాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ అంబాజీ, డిపార్ట్మెంటల్ అధికారి వెంకటేశ్వర్ నివాస్ తెలిపారు. ఒకేషనల్ పరీక్ష కు 40 మంది విద్యార్థులకు గాను ఒక విద్యార్థి గైరాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు వైద్య సదుపాయంతాగునీరు తోపాటు వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఊట్కూర్ లో పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థులు.

